VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : గురువారం 06.08.2026
సంపుటి : 09 సంచిక : 58 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



హైదరాబాద్ బంజారాహిల్స్ లోని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రిపొన్నం ప్రభాకర్ ను వారి అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మిణుగూరు ఎడిటర్ కలుకూరి రాజు, వెలుతురు దినపత్రిక ఎడిటర్ బక్క యాదయ్య గౌడ్
హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:

# తుమ్మిడిహెట్టి ఎత్తు 150 మీటర్లకు పెంచండి

## కేంద్రాన్ని కోరిన సీఎం రేవంత్ రెడ్డి

- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో రేవంత్ రెడ్డి భేటీ
- మహారాష్ట్రతో చర్చల్లో కేంద్రం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి అంగీకారం తీసుకురావాలని అభ్యర్థన
- గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యమవుతుందని సీఎం వివరణ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలువురు ఎంపీలు సమావేశంలో పాల్గొనడం
- కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్‌తోనూ ప్రత్యేకంగా చర్చలు



3





2

## 112కు కాల్ చేస్తే స్పందన తప్పనిసరి

- తెలంగాణలో డయల్ 112 సేవల ప్రారంభం
- కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రారంభించిన డీజీపీ ఆనంద్
- పోలీస్, అగ్నిమాపక, అంబులెన్స్ సేవలు ఒకే వేదికపై
- అత్యవసర సేవలకు ఒకే నంబర్‌గా 112

## మోదీ వీడియో తొలగింపు.. మెటాకు మూడు రోజుల అల్టిమేటం



2

- మెటాపై ఐటీ పార్లమెంటరీ స్థాయీ సంఘం ఆగ్రహం
- మూడు రోజుల్లో జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టీకరణ
- లేదంటే సేఫ్ హార్బర్ రక్షణ కోల్పోయే అవకాశం
- మోదీ వీడియో తొలగింపును ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించిన ప్యానెల్
- సాంకేతిక లోపం వివరణ సరిపోదన్న కేంద్రం
- జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని ప్రభుత్వ అభిప్రాయం



## మూడు గంటలే నిద్ర.. కొత్త రాజ్యసభ ఎంపీలకు మోదీ సూచనలు

- కొత్త ఎన్డీయే రాజ్యసభ ఎంపీలతో ప్రధాని సమావేశం
- సభకు పూర్తి హాజరు కావాలని ఎంపీలకు సూచన
- ప్రతిపక్ష సభ్యుల నుంచి కూడా మంచి విషయాలు నేర్చుకోవాలని హితవు
- వ్యక్తిగత క్రమశిక్షణపై ప్రధాని దిశానిర్దేశం
- రోజుకు మూడు గంటలే నిద్రపోతానని వెల్లడి
- విదేశీ పర్యటనల్లో స్థానిక కాలమానానికే గడియారం మార్చుకుంటానని వ్యాఖ్య

2

## ఆషాఢ మాసం బోనాల వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాదు వెలుతురు ఆగస్టు 05:

నిజామాబాద్ పాత కలెక్టరేట్ ప్రాంగణంలో టీఎన్‌జీఓఎస్ (TNGOS) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ మాసం బోనాల మహోత్సవాల్లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యానారాయణ కూడా పాల్గొని భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో సందడి చేశారు. అనంతరం నిర్వాహకులు మహేష్ కుమార్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు కేశ వేణు, శేఖర్ గౌడ్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, దయాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీఎన్‌జీఓఎస్ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భేటీ



న్యూఢిల్లీ వెలుతురు ఆగస్టు 05:

భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్ తో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ మర్యాదపూర్వక భేటీ 30 నిమిషాలకు పైగా కొనసాగింది.

▶ మిగతా 2లో

## ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

- సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన
- రూ. 680 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం
- చంచల్‌గూడ నుంచి ఒవైసీ ఆసుపత్రి వరకు..
- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం



3

హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 5:

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం రోజున హైదరాబాద్ నగరంలోని సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి మరియు మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనులను మరో మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



3

## నీటి విషయంలో అన్యాయం ఊరుకోం:మాజీ మంత్రి హరీశ్ రావు

- జీఆర్ఎంబీ సమావేశ అజెండాపై బీఆర్ఎస్ అభ్యంతరం
- తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల సమీక్ష ప్రతిపాదనపై విమర్శలు
- ఏపీ ప్రయోజనాల కోసమే అజెండా రూపొందించారని ఆరోపణ

## విజయ్ తొలి బడ్జెట్.. వధువులకు బంగారం, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

### తమిళనాడు అసెంబ్లీలో తొలి బడ్జెట్ ప్రవేశపెట్టిన విజయ్ ప్రభుత్వం



2

- వధువులకు 8 గ్రాముల బంగారం, పట్టుచీర పథకం
- కృత్రిమ మేధలో ఐదు లక్షల మందికి శిక్షణ లక్ష్యం
- విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2 వేల కోట్లు
- 11వ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లు, హెల్మెట్లు
- ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు రూ.300 కోట్లు



## హైదరాబాద్‌లో బ్రిక్స్ అవినీతి నిరోధక సదస్సు

- నైతిక పాలన, నిధుల రికవరీపై కీలక నిర్ణయాలు
- ముగిసిన బ్రిక్స్ అవినీతి నిరోధక, రికవరీ నిపుణుల సదస్సు
- అవినీతి సహించేది లేదన్న కార్యదర్శి రచన షా
- నిందితుల సమాచార మార్పిడికి బ్రిక్స్ ప్రాథమిక అంగీకారం

హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 5:

భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత 2026 ఆధ్వర్యంలో, కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'రెండవ బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్' మరియు 'అస్సెట్ రికవరీ ఎక్స్‌పర్ట్ నెట్‌వర్క్' సమావేశాలు తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిశాయి. ఆగస్టు 4 మరియు 5 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సమావేశాలకు బ్రిక్స్ సభ్య దేశాల నుంచి ప్రతినిధులు, ఆర్థిక నిఘా వర్గాలు, చట్ట అమలు సంస్థల నిపుణులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భారత్ నిర్దేశించిన "స్థిరత్వం, నూతన ఆవిష్కరణలు, సహకారం మరియు సుస్థిరత కోసం నిర్మాణం" అనే ప్రధాన ఇతివృత్తానికి అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా అవినీతి నిర్మూలన, ఆర్థిక నేరాల అరికట్టుపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు.ఈ అంతర్జాతీయ సమావేశాలను కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ కార్యదర్శి రచన షా అధికారికంగా ప్రారంభించారు.

▶ మిగతా 2లో

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

- 8 ప్రైవేట్ జూనియర్ కాలేజీలపై క్రిమినల్ కేసులు
- ఫైర్ ఎన్‌వోసీ పత్రాల్లో రంగనాథ్ సంతకం ఫోర్జరీ
- అగ్నిమాపక అనుమతుల పేరుతో నకిలీ పత్రాలు



2

- బర్కత్‌పురా కాలేజీ ఫిర్యాదుతో వెలుగులోకి
- ప్రైవేట్ జూనియర్ కళాశాలల తీవ్ర అక్రమాలు
- 70కి పైగా ఎన్‌వోసీలను తనిఖీ చేసిన హైడ్రా

# 112కు కాల్ చేస్తే స్పందన తప్పనిసరి

- కాలర్ స్థానాన్ని గుర్తించే ఆధునిక వ్యవస్థ
- త్వరలో డ్రోన్ బృందాల ఏర్పాటు
- సాంకేతిక పోలీసింగ్‌కు ప్రాధాన్యం

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 5:**

తెలంగాణలో అత్యవసర సేవలను మరింత వేగంగా ప్రజలకు అందించేందుకు డయల్ 112 సేవలను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ బుధవారం హైదరాబాద్‌లోని సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం సహా పలు అత్యవసర అవసరాలకు డయల్ 112 ఒకే పరిష్కార మార్గమని తెలిపారు. 112కు వచ్చిన ఏ కాల్‌నూ పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించరాదని స్పష్టం చేశారు.ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనను మరింత బలోపేతం చేయడమే ఈ వ్యవస్థ లక్ష్యమని డీజీపీ తెలిపారు. పోలీస్, అగ్నిమాపక, అంబులెన్స్ సేవలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే పర్యవేక్షిస్తామని చెప్పారు.112కు కాల్ వచ్చిన వెంటనే కాలర్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక వ్యవస్థలను వినియోగిస్తున్నామని వివరించారు. త్వరలో డ్రోన్ ఆధారిత సాంకేతిక వ్యవస్థను కూడా తెలంగాణ పోలీసులు వినియోగించనున్నారని, ఇందుకోసం ప్రత్యేక డ్రోన్ బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. డయల్ 112 సేవలు 3.0 రూపంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు.సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని డీజీపీ ఆనంద్ చెప్పారు. యువ సాంకేతిక నిపుణులు, కృత్రిమ మేధస్సు వినియోగంలో నైపుణ్యం కలిగిన వారిని ఈ వ్యవస్థలో భాగస్వామ్యం చేయనున్నట్లు వెల్లడించారు. సంప్రదాయ పోలీసింగ్‌తో పాటు సాంకేతిక పోలీసింగ్‌ను కూడా సమాంతరంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని టవర్-బీలో రెండు అంతస్తులను డయల్ 112 సేవలకు కేటాయించినట్లు తెలిపారు. 2013లో కొంపల్లిలో జీవీకే సంస్థ సహకారంతో డయల్ 100 సేవలను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని అత్యవసర సేవలకు ఒకే నంబర్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం సూచించడంతో తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి సాంకేతిక అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటూ వచ్చామని చెప్పారు. ఇటీవల కృత్రిమ మేధస్సు అందుబాటులోకి రావడంతో అనేక పనులు మరింత సులభంగా మారాయని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు.

# అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో ముఖ్యమంత్రి...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా వివిధ అంశాలు చర్చించారు. తెలంగాణలో విద్య, ఉపాధి, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే తెలంగాణ విద్యార్థులకు వీసాలను పెంచాలని, వీసా అపాయింట్‌మెంట్లు సకాలంలో లభించేలా సహకరించాలని కోరారు. వీసా ఇంటర్వ్యూ స్లాట్లను పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కోరారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణ కు చెందిన వివిధ రంగాల నిపుణుల సమస్యలను కూడా రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. H-1B వీసా ప్రాసెసింగ్, రెన్యువల్, వీసా స్టాంపింగ్ ఆలస్యం కాకుండా సరళతరం చేయాలని కోరారు. వీసా నిబంధనల్లో వచ్చే మార్పులపై ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. అమెరికాలో చదువుతున్న తెలంగాణ విద్యార్థుల భద్రత, సంక్షేమంపై కూడా చర్చించారు. తెలంగాణలో అమెరికా సంస్థలకు విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఐటీ, కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్‌లు, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు. అమెరికా విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యాసంస్థలతో కలిసి పనిచేసేలా సహకరించాలని కోరారు. విద్యార్థుల మార్పిడి, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. అమెరికాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. భారతదేశ చరిత్ర, సంస్కృతిపై రాయబారి సెర్జియో గోర్‌కు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందన్నారు. ప్రత్యేకంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలు, రాష్ట్ర బలాలపై రాయబారి చూపిన ఆసక్తిని ముఖ్యమంత్రి అభినందించారు. తెలంగాణ–అమెరికా మధ్య వ్యాపారం, పెట్టుబడులు, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలను మరింత విస్తరించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని రాయబారి సెర్జియో గోర్ హామీ ఇచ్చారు.బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# విజయ్ తొలి బడ్జెట్.. వధువులకు బంగారం, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

- కొన్ని ఎన్నికల హామీలపై మాత్రం ప్రకటన లేదు



**చెన్నై, వెలుతురు, ఆగస్టు 5:**

తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వచ్చిన తొలి బడ్జెట్ కావడంతో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలకు ఈ బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చారు.ఎన్నికల హామీల్లో భాగంగా 'అన్నన్ సీర్ తిట్టమ్' పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం కింద పెళ్లి కూతురికి 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీర అందించనున్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.812 కోట్లు కేటాయించారు.2031 నాటికి ఐదు లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే 'వెట్రి థిరన్' శిక్షణ పథకం కింద దశలవారీగా లక్ష మంది ఉద్యోగార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పించనున్నారు.విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందించేందుకు 'వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్' పేరుతో రూ.2 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కోసం రూ.300 కోట్లను ప్రకటించారు.'పుతియా పయనం–పుతియా వేగం' పథకం కింద 11వ తరగతి చదువుతున్న 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందించనున్నారు. వాటితో పాటు హెల్మెట్లు, నీటి సీసాలు కూడా పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన కొన్ని ప్రధాన హామీలపై ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయలేదు. కుటుంబ పెద్దగా ఉన్న మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, ఏడాదికి ఆరు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు భృతి, మహిళలకు అన్ని ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి హామీల అమలుపై బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదు.

# హైదరాబాద్‌లో బ్రిక్స్ అవినీతి నిరోధక...

(మొదటి పేజీ తరువాయి)

సదస్సును ఉద్దేశించి ఆమె మాట్లాడుతుండగా, అవినీతి పట్ల భారతదేశం అవలంబిస్తున్న 'జీరో టాలరెన్స్' (సహించేది లేని) విధానాన్ని స్పష్టంగా వివరించారు. సుపరిపాలన, సుస్థిర అభివృద్ధి మరియు ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడానికి అవినీతి రహిత వాతావరణం, సమర్థవంతమైన వ్యవస్థలు, సాంకేతికత ఆధారిత పాలన మరియు సుదీర్ఘ అంతర్జాతీయ సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. బ్రిక్స్ కూటమి కేవలం ఆలోచనలను పంచుకునే వేదిక స్థాయి నుంచి ప్రత్యక్షంగా కార్యాచరణ అమలు చేసే స్థాయికి రూపాంతరం చెందుతోందని ఆమె అభిప్రాయపడ్డారు.సమావేశంలో భారత్ తీసుకువచ్చిన ప్రధాన ప్రతిపాదన అయిన "ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన నిందితులను చట్టం ముందుకు తీసుకురావడం మరియు పరస్పరం అప్పగించడం" అనే అంశంపై బ్రిక్స్ దేశాలు తీవ్రంగా చర్చించాయి. నేరగాళ్లను పట్టుకోవడానికి మరియు సమాచార మార్పిడి వేగవంతం చేయడానికి 'బ్రిక్స్ నెట్‌వర్క్ ఆఫ్ లా-ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్స్' ఏర్పాటుకు సభ్యదేశాలు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపాయి. ఇది అధికారిక న్యాయపరమైన ప్రక్రియల కంటే వేగంగా, అంతర్జాతీయ స్థాయిలో సమాచారాన్ని మార్పిడి చేసుకునేందుకు, పారిపోయిన నిందితుల ఆచూకీ కనిపెట్టేందుకు వీలు కల్పిస్తుందని సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు.దీనితో పాటు, పారిపోయిన నిందితుల సమాచారాన్ని సేకరించడానికి మరియు విదేశీ ఏజెన్సీలతో కమ్యూనికేషన్‌ను సులభతరం చేయడానికి రూపుదిద్దుకున్న 'బ్రిక్స్ రిపాజిటరీ ఆన్ ఇన్ఫార్మల్ కోఆపరేషన్' ఆవిష్కరణను సభ్యదేశాలు హర్షించాయి. ఈ ప్రాక్టికల్ రిపాజిటరీ ద్వారా ఏ ఏ దేశంలో ఎలాంటి చట్టాలు ఉన్నాయి, ఏయే నెట్‌వర్క్‌ల ద్వారా శోధించవచ్చో ప్రతి దేశపు ప్రాక్టీషనర్లకు సమగ్ర సమాచారం సులభంగా అందుబాటులోకి వస్తుంది.విదేశాలకు తరలించిన అవినీతి సొమ్ము మరియు ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునే (అస్సెట్ రికవరీ) విధానంలో కూడా ఈ హైదరాబాద్ సమావేశం విప్లవాత్మక పురోగతిని సాధించింది. దర్యాప్తు ప్రారంభ దశలోనే వివిధ దేశాల చట్ట సంస్థలు ఒకరికొకరు త్వరితగతిన సమాచారం ఇచ్చుకునేలా ఒక ప్రామాణికమైన ఆకృతిని ఖరారు చేశారు. అలాగే బ్రిక్స్ దేశాలలోని సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడేందుకు 'డైరెక్టరీ ఆఫ్ ఫోకల్ పాయింట్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్' జాబితాను ఆమోదించి, దానిని ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో నవీకరించేలా ప్రణాళిక రూపొందించారు.సదస్సులో భాగంగా "నూతన ఆవిష్కరణలు, సాంకేతికత ద్వారా నైతిక పాలన" అనే ప్రత్యేక అంశంపై సబ్-సెషన్ నిర్వహించారు. ప్రభుత్వ కొనుగోళ్లలో (డిజిటల్ ప్రొక్యూర్మెంట్) పూర్తిస్థాయి డిజిటల్ విధానాలు తీసుకురావడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, మానవ జోక్యం తగ్గి అవినీతి అవకాశాలు మూతపడతాయని సభ్యదేశాలు అంగీకరించాయి. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ సాధనాల ద్వారా తప్పు జరిగిన తర్వాత పట్టుకోవడం కాకుండా, తప్పు జరగక ముందే రియల్ టైమ్‌లో ముప్పును గుర్తించి నివారించవచ్చని నిపుణులు ఉదాహరణలతో వివరించారు.అదే సమయంలో ఫిన్‌టెక్, వర్చువల్ డిజిటల్ అసెట్స్ (క్రిప్టో వంటి డిజిటల్ కరెన్సీలు) వినియోగంలో ఉన్న సాంకేతికత వల్ల ఎదురవుతున్న కొత్త రకం సవాళ్లపై కూడా సమావేశం తీవ్రంగా చర్చించింది. డిజిటల్ లావాదేవీలు వేగవంతంగా మరియు సరిహద్దులు లేకుండా జరగడం వల్ల అక్రమ సొమ్మును దాచడానికి, మనీ లాండరింగ్ చేయడానికి నేరగాళ్లు దీనిని వాడుకుంటున్నారని ఆందోళన వ్యక్తమైంది. దీనిని అరికట్టేందుకు స్పష్టమైన, ప్రమాద-ఆధారిత నిబంధనలను బ్రిక్స్ దేశాలు అమలు చేయాలని, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్లు మరింత వేగంగా డేటాను మార్పిడి చేసుకోవాలని నిశ్చయించారు.హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ఈ రెండు రోజుల అవినీతి నిరోధక సదస్సు, భారత్ బ్రిక్స్ అధ్యక్ష హోదాలో చేపట్టిన ప్రతిపాదనలకు గట్టి పునాది వేసింది. ఆర్థిక నేరగాళ్లపై ఉమ్మడి పోరాటం, డిజిటల్ సాంకేతికతతో పారదర్శకత, విదేశీ ఆస్తుల పునరుద్ధరణ వంటి అంశాల్లో సభ్యదేశాల మధ్య ఒక దృఢమైన బంధాన్ని ఏర్పరిచింది. రాబోయే బ్రిక్స్ అధ్యక్షత్వ బాధ్యతలు చేపట్టే దేశాలు ఈ వేదికను మరింత ముందుకు తీసుకెళ్లి, కార్యాచరణ రూపంలోకి తెచ్చేందుకు ఈ నిర్ణయాలు ఎంతగానో దోహదపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 5:**

హైదరాబాద్ నగరం మరియు పరిసర జిల్లాల్లోని కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలు అత్యంత దారుణమైన మోసానికి ఒడిగట్టాయి. తెలంగాణ ప్రభుత్వ పరిధిలోని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ, అగ్నిమాపక శాఖ నుంచి పొందాల్సిన నిరభ్యంతర పత్రాలను (ఫైర్ ఎన్‌వోసీ) తీసుకోకుండానే, నకిలీ పత్రాలను సృష్టించి తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలికి (ఇంటర్ బోర్డు) సమర్పించాయి. ఈ దారుణ అక్రమంపై తీవ్రంగా స్పందించిన హైడ్రా యంత్రాంగం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు బాధ్యులైన కళాశాలల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని ఇంటర్ బోర్డును గట్టిగా కోరింది.ఈ బాగోతం వెనుక ఉన్న వివరాలను పరిశీలిస్తే, రాజధాని నగరంలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు, పునరుద్ధరణ పొందేందుకు ఫైర్ ఎన్‌వోసీ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఈ క్రమంలో హైడ్రా లేదా అగ్నిమాపక శాఖ నుంచి ఎలాంటి చెల్లుబాటు అయ్యే అనుమతులు తీసుకోకుండానే, కొన్ని సంస్థలు నకిలీ పత్రాలను సృష్టించి ఇంటర్ బోర్డు అధికారులను బురిడీ కొట్టించాయి. నిబంధనల ప్రకారం ఫైర్ సేఫ్టీ వసతులు లేకపోయినా, ఉన్నట్లుగా నకిలీ ఎన్‌వోసీలను రికార్డుల్లో చేర్చడం విద్యార్థుల భద్రతను తీవ్ర ప్రమాదంలోకి నెట్టడమేనని అధికారులు భావిస్తున్నారు.ముఖ్యంగా నగరంలోని బర్కత్‌పురా ప్రాంతంలో ఉన్న ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాల ఇంటర్ బోర్డుకు సమర్పించిన ఫైర్ ఎన్‌వోసీ నకిలీదని, ఎలాంటి అనుమతులు లేకున్నా నకిలీ పత్రం జత చేసిందంటూ హైడ్రా ఉన్నతాధికారులకు ఒక ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ మరియు ఇతర అధికారులు వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రైవేట్ జూనియర్ కాలేజీలు సమర్పించిన ఫైర్ ఎన్‌వోసీల నిజానిజాలను తేల్చేందుకు, అన్ని కళాశాలల వివరాలను తమకు అందజేయాలని ఇంటర్మీడియట్ బోర్డును అధికారికంగా కోరారు.హైడ్రా విజ్ఞప్తి మేరకు ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు వెంటనే స్పందించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు (డిఐఈవోలు) వివిధ ప్రైవేట్ కాలేజీల నుంచి సేకరించిన 70కి పైగా ఫైర్ ఎన్‌వోసీ పత్రాలను సమగ్ర పరిశీలన కోసం హైడ్రా కార్యాలయానికి పంపించారు. ఈ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అధికారులు దిగ్భ్రాంతి చెందే నిజాలను కనుగొన్నారు.ఇంటర్ బోర్డు పంపిన పత్రాలను నిశితంగా పరిశీలించిన హైడ్రా సాంకేతిక నిపుణులు, అధికారులు.. అందులోని 8 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు సమర్పించిన ఫైర్ ఎన్‌వోసీలు పూర్తిగా నకిలీవని తేల్చారు. ఆయా సర్టిఫికెట్లపై ఉన్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని హుందాగా ఫోర్జరీ చేసినట్లు స్పష్టమైన ఆధారాలతో నిర్ధారించారు. అంతేకాకుండా, ప్రస్తుతం వెలుగు చూసిన ఈ 8 కాలేజీలే కాకుండా, నకిలీ ఎన్‌వోసీలతో కొనసాగుతున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల సంఖ్య హైదరాబాద్ మహానగర పరిధిలో మరిన్ని ఉండవచ్చని అధికారులు బలమైన అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.కమిషనర్ సంతకం ఫోర్జరీకి గురికావడం, నకిలీ పత్రాలతో ఇంటర్ బోర్డునే మోసగించడంతో హైడ్రా అధికారులు చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు. హైడ్రా అదనపు డైరెక్టర్ బాధ్యులైన 8 ప్రైవేట్ జూనియర్ కాలేజీ యాజమాన్యాలపై లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. దీంతో లేక్ పోలీసులు సదరు కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ప్రభుత్వ అధికారిక హోదా కలిగిన ఐఏఎస్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని పోలీసులు తెలిపారు.పోలీసులు నమోదు చేసిన కేసులో ప్రధానంగా నకిలీ పత్రాల తయారీ, ప్రభుత్వ ధృవీకరణ పత్రాల ఫోర్జరీ, ఇంటర్ బోర్డును మరియు విద్యాశాఖను మోసం చేయడం, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం వంటి పలు తీవ్రమైన ఐపీసీ/భారతీయన్యాయ సంహిత సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. ప్రస్తుతం లేక్ పోలీసులు ఈ దందా వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు, నకిలీ పత్రాలను సృష్టించిన ఏజెంట్లు లేదా కళాశాల సిబ్బంది ఎవరు అనే కోణంలో లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. త్వరలోనే బాధ్యులను అరెస్ట్ చేస్తామని వెల్లడించారు.

ఇదిలా ఉండగా, నకిలీ సర్టిఫికెట్లతో చట్టాన్ని ఉల్లంఘించిన ఆ 8 ప్రైవేట్ జూనియర్ కళాశాలల వివరాలను హైడ్రా అధికారులు వెల్లడించారు. అవి:

1. **హైందవి జూనియర్ కాలేజీ (బర్కత్‌పుర)**
2. **రెసోనెన్స్ జూనియర్ కాలేజీ (ఎస్ఆర్ నగర్)**
3. **ప్రియాంక జూనియర్ కాలేజీ (మెహిదీపట్నం)**
4. **మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజీ (విద్యానగర్)**
5. **శ్రీచైతన్య జూనియర్ కాలేజీ (చంద్రాయణగుట్ట)**
6. **న్యూ ఎరా జూనియర్ కాలేజీ (చిక్కడపల్లి)**
7. **షాహీన్ జూనియర్ కాలేజీ (శివరాంపల్లి)**
8. **వశిష్ట జూనియర్ కాలేజీ (తెల్లాపూర్).**

ఈ ఎనిమిది కళాశాలలు సమర్పించిన ఎన్‌వోసీలు చెల్లవని, మోసపూరితంగా పొందిన గుర్తింపులను తక్షణమే రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శికి హైడ్రా అధికారులు లేఖ రాశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఇలాంటి అక్రమాలకు పాల్పడే కళాశాలలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# మోదీ వీడియో తొలగింపు.. మెటాకు మూడు రోజుల అల్టిమేటం

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 5:**

ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమ ఖాతాలోని వీడియో కొంతసేపు కనిపించకుండా పోయిన ఘటనపై ఐటీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం మెటా సంస్థకు మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఆలోపు మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పడంతో పాటు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.ఈ వ్యవహారంలో తగిన చర్యలు తీసుకోకపోతే మెటా చట్టబద్ధమైన "సేఫ్ హార్బర్" రక్షణను కోల్పోయే ప్రమాదం ఉందని పార్లమెంటరీ స్థాయీ సంఘం హెచ్చరించింది. అలా జరిగితే సంస్థ అధికారులపై నేరుగా కేసులు నమోదు చేసే అవకాశం ఉంటుందని పేర్కొంది.140 కోట్ల మంది భారతీయులకు ప్రతినిధిగా ఉన్న ప్రధాని మోదీ పంచుకున్న వీడియోను తొలగించడం ప్రజాస్వామ్యంపై దాడితో సమానమని పార్లమెంటరీ ప్యానెల్ అభిప్రాయపడింది. ఈ ఘటనపై మెటా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది.నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న సమయంలో ప్రధాని మోదీ అర్ధరాత్రి తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఒక స్వీయ వీడియోను పంచుకున్నారు. "ప్రశ్నాపత్రం లీక్ సాధారణ విషయం కాదని నాకు తెలుసు" అంటూ యువతను ఉద్దేశించి చేసిన ఆ వీడియో విస్తృతంగా వైరల్ అయింది. అయితే కొంతసేపు అది ఖాతాలో కనిపించకుండా పోయి, తర్వాత మళ్లీ అందుబాటులోకి వచ్చింది.ఈ ఘటనకు సాంకేతిక లోపమే కారణమని మెటా ఇప్పటికే భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపింది. అయితే ఆ వివరణ సరిపోదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ అభిప్రాయపడింది. ఇది కేవలం సాంకేతిక సమస్య కాదని, జాతీయ భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన అంశమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ఈ నేపథ్యంలో మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యక్షుడు నిశికాంత్ దుబే మరోసారి డిమాండ్ చేశారు.

# మూడు గంటలే నిద్ర.. కొత్త రాజ్యసభ ఎంపీలకు మోదీ సూచనలు

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 5:**



ఎన్డీయే నుంచి ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన కొత్త సభ్యులతో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం పార్లమెంట్ సమావేశాలకు ముందు అల్పాహార సమావేశం నిర్వహించారు. దాదాపు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో పార్లమెంటు వ్యవహారాలు, వ్యక్తిగత క్రమశిక్షణ, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై వారికి పలు కీలక సూచనలు చేశారు.జూన్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల తర్వాత తొలిసారిగా పార్లమెంటులో అడుగుపెట్టిన సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వారిలో భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా ఉన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులతో ఎలా వ్యవహరించాలి, సభా మర్యాదలను ఎలా పాటించాలనే అంశాలపై ప్రధాని మార్గనిర్దేశం చేశారు.వీలైనంత ఎక్కువ సమయం సభలోనే గడపాలని, వంద శాతం హాజరు ఉండేలా చూసుకోవాలని కొత్త ఎంపీలకు సూచించారు. సొంత పార్టీ సభ్యుల నుంచే కాకుండా ప్రతిపక్ష ఎంపీల నుంచి కూడా మంచి విషయాలను నేర్చుకోవాలని హితవు పలికారు.సమావేశంలో తన వ్యక్తిగత దినచర్య గురించి ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ప్రధాని స్పందించారు. తాను నిద్రకు ఉపక్రమించిన తర్వాత ఎనిమిది సెకన్లలోపే నిద్రపోతానని, రోజుకు కేవలం మూడు గంటలు మాత్రమే నిద్రపోతానని తెలిపారు. జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే వర్తమానంలో జీవించడం ఎంతో ముఖ్యమని, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విదేశీ పర్యటనల గురించి మాట్లాడుతూ, విమానం ఎక్కిన వెంటనే తాను వెళ్లే దేశం కాలమానానికి అనుగుణంగా గడియారంలోని సమయాన్ని మార్చుకుంటానని చెప్పారు. దీనివల్ల కొత్త దేశానికి చేరుకున్న తర్వాత సమయ భేదం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని ప్రధాని వివరించారు.

# ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులతో సమావేశం

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**

ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులతో బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, మట్టా రాగమయిదయానంద్, ఖమ్మం డీసీసీ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.సమావేశంలో త్వరలో ఖాళీ కానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై విస్తృతంగా చర్చించారు.పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా ఇంచార్జ్ మంత్రులు సంబంధిత ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరిస్తున్న నేపథ్యంలో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశావహుల వివరాలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పేర్లను పీసీసీకి పంపించాలని సమావేశంలో నిర్ణయించారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆశావహుల



వివరాలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన వారి వివరాలను పీసీసీకి పంపాలని నిర్ణయం

# జానకంపేటలో డాక్టర్ తాళ్ల లక్ష్మీనారాయణ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**జానకంపేట వెలుతురు ఆగస్టు 05:**

బోధన్ నియోజకవర్గంలోని జానకంపేట గ్రామంలో ఇటీవల కన్నుమూసిన ప్రముఖ కవి, డాక్టర్ తాళ్ల లక్ష్మీనారాయణ గౌడ్ కుటుంబ సభ్యులను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ బుధవారం పరామర్శించారు.ఈ సందర్భంగా డాక్టర్ తాళ్ల లక్ష్మీనారాయణ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన మహేష్ కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, డాక్టర్ తాళ్ల లక్ష్మీనారాయణ గౌడ్ వంటి గొప్ప కవిని కోల్పోవడం తెలుగు సాహిత్యానికి తీరని లోటని అన్నారు. సినారె వంటి మహోన్నత సాహిత్యవేత్తల సరసన నిలిచే ప్రతిభ ఉన్నప్పటికీ, ఆయనకు రావాల్సిన స్థాయి గుర్తింపు దక్కకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన రచనలు, సాహిత్య సేవ చిరస్థాయిగా నిలిచి



పోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు కేశ వేణు, శేఖర్ గౌడ్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, దయాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి విషయంలో అన్యాయం ఊరుకోం:మాజీ మంత్రి హరీశ్ రావు



- రాష్ట్ర ప్రభుత్వం మౌనం ఎందుకని ప్రశ్నించిన హరీశ్
- ప్రాజెక్టుల అనుమతులు రద్దయితే తెలంగాణకు నష్టం అని హెచ్చరిక
- కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త అనుమతి కూడా తీసుకురాలేదని విమర్శ
- నీటి హక్కుల విషయంలో పోరాటం తప్పదని స్పష్టం

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 5:**

ఈ నెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశ అజెండాపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు లభించిన అనుమతులను సమీక్షించాలని అజెండాలో చేర్చడం ఆందోళనకరమని అన్నారు. అజెండా విడుదలై వారం రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఆశ్చర్యకరమని విమర్శించారు.ఏపీ ప్రభుత్వం తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని కోరితే, ఆ అంశాన్ని జీఆర్ఎంబీ అజెండాలో ఎలా చేర్చారని హరీశ్‌రావు ప్రశ్నించారు. మొత్తం అజెండా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు.తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నప్పటికీ, ఇటీవల వాటిని నిలిపివేయాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీకి తాకట్టు పెడుతోందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని విమర్శించారు.తెలంగాణకు తాగునీరు, సాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయడం అంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమేనని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సమర్థంగా వినియోగించడం లేదని, గోదావరిలో అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ కోరితే దానిని కూడా జీఆర్ఎంబీ అజెండాలో చేర్చారని మండిపడ్డారు. నీటి విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే ప్రజలు ఊరుకోరని ఆయన హెచ్చరించారు.

# తుమ్మిడి హెట్టి ఎత్తు 150 మీటర్లకు పెంచండి

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 5:**



దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణానికి అవసరమైన కేంద్ర అనుమతులపై కేంద్ర మంత్రులతో చర్చించారు.కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో జరిగిన సమావేశంలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు ప్రధాన అంశంగా నిలిచింది. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలువురు ఎంపీలు కూడా పాల్గొన్నారు. ప్రాజెక్టు ఎత్తును 150 మీటర్లకు పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సీఎం కోరారు.గతంలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును 148 మీటర్ల ఎత్తుతో నిర్మించేందుకు మహారాష్ట్ర అంగీకరించిందని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. ప్రస్తుతం మరో రెండు మీటర్లు పెంచి 150 మీటర్ల ఎత్తుతో నిర్మించినా ముంపు విస్తీర్ణం వెయ్యి హెక్టార్లలోపే ఉంటుందని వివరించారు. ఈ మేరకు మహారాష్ట్రతో చర్చించి అంగీకారం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు 150 మీటర్ల ఎత్తుతో నిర్మితమైతే ఎత్తిపోతల పథకాలపై భారీగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదని సీఎం తెలిపారు. గ్రావిటీ ద్వారానే నీటిని సరఫరా చేసే అవకాశం ఉండటంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గుతుందని, విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా ఆదా అవుతుందని వివరించారు. ఈ అంశాన్ని కేంద్రం సానుకూలంగా పరిశీలించి మహారాష్ట్రతో సమన్వయం చేయాలని కోరారు.

అనంతరం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో కూడా సీఎం సమావేశమయ్యారు. తెలంగాణలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పనులకు అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరినట్లు సమాచారం.

# ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం...





(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న నిర్మాణ నాణ్యతను, పనుల వేగాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులన్నీ పూర్తి కావడంతో త్వరలోనే వీటిని ప్రజా ఉపయోగం కోసం ప్రారంభించనున్నట్లు మంత్రి పొన్నం ప్రకటించారు.పర్యటన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణాన్ని రూ. 680 కోట్ల భారీ వ్యయంతో విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఈ ఫ్లైఓవర్ చంచల్‌గూడ జైలు నుంచి ఒవైసీ ఆసుపత్రి వరకు, అలాగే చంపాపేట్ వైపు మరో మార్గంతో అనుసంధానమై పూర్తయిందని వివరించారు. ఈ ప్రాజెక్టును త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించి నగర ప్రజలకు అంకితం చేస్తామని పేర్కొన్నారు.ఈ స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి రావడం వల్ల సంతోష్‌నగర్, చంచల్‌గూడ జైలు పరిసర ప్రాంతాలు, సైదాబాద్ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి తెలిపారు. నిత్యం వాహన రద్దీతో నరకయాతన అనుభవించే ప్రయాణికులు ఇకపై చాలా తక్కువ సమయంలోనే తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వారధిని నిర్మించినట్లు వెల్లడించారు.అదేవిధంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణం కూడా దాదాపు పూర్తయిందని, అన్ని రకాల తుది మెరుగులు దిద్దిన తర్వాత దీనిని కూడా అతి త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. పాతబస్తీ మరియు పరిసర ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ వంతెన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు.హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా మరియు వాహనాల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సమగ్రమైన ప్రణాళికలతో చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీని నియంత్రించేందుకు చేపట్టిన బ్రిడ్జి పనులు కూడా అత్యంత వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో మౌలిక వసతుల విస్తరణ నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ, రాజధాని హైదరాబాద్‌లో ప్రధాన సమస్యగా మారిన ట్రాఫిక్ రద్దీని శాశ్వతంగా తగ్గించాలనే స్పష్టమైన లక్ష్యంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఫ్లైఓవర్లను ప్రణాళికాబద్ధంగా నిర్మిస్తోందని తెలిపారు.

కొత్తగా అందుబాటులోకి వస్తున్న ఈ వంతెనల ద్వారా నగరంలో ట్రాఫిక్ జామ్‌లు గణనీయంగా తగ్గడమే కాకుండా, వాహనదారుల విలువైన ప్రయాణ సమయం మరియు ఇంధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు.నగరంలో ఎక్కడెక్కడ తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు, రద్దీ కూడళ్లు (బాటిల్ నెక్స్) ఉన్నాయో వాటిని నిపుణులతో గుర్తించి, ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన చోట్ల కొత్త ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి అజహరుద్దీన్ వివరించారు. ప్రజా రవాణాను మెరుగుపరచడానికి, నగర సౌందర్యీకరణకు ప్రభుత్వం అన్ని రకాల వనరులను సమకూరుస్తోందని స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, స్థానిక శాసనసభ్యులు అహమ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కాలేరు వెంకటేష్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే నగర రవాణా రంగంలో సరికొత్త మార్పులు వస్తాయని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు.

# సత్ఫలితాలిస్తున్న చర్యలు మరింత బలోపేతం

## భారత దేశ పరిస్థితులకు అనుగుణంగా తల్లిపాలను ప్రోత్సహించడం



డాక్టర్ అశ్వతీ విజయ్‌కుమార్, నేహా గేహి

ప్రతి బిడ్డ జీవితానికి సాధ్యమైనంత ఉత్తమమైన ఆరంభాన్ని అందించడానికి ఉన్న అత్యంత సులభమైన, శక్తిమంతమైన మార్గాల్లో ఒకదానిని ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రతి ఏటా మనకు గుర్తు చేస్తాయి. ఇవి... పుట్టిన తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు ప్రారంభించడం, మొదటి ఆరు నెలలూ వాటిని మాత్రమే ఇవ్వడం, రెండేళ్లు నిండేంత వరకు, ఆ తర్వాత అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాల్సిన ఆవశ్యకతను తెలిజేస్తాయి. ఈ ఏడాది ఇతివృత్తం "సుస్థిర జీవితారంభానికి తల్లిపాలు: సత్ఫలితాలిస్తున్న చర్యలను మరింత బలోపేతం చేద్దాం". ఇది శిశువు మనుగడ, తల్లి ఆరోగ్యం, సుస్థిరమైన అభివృద్ధికి ప్రధానాధారంగా తల్లిపాలను ప్రోత్సహించాల్సిన, మద్దతు అందించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తుంది.

ప్రకృతి అందించిన తొలి టీకాగా తల్లిపాలను తరచూ వర్ణిస్తారు. కానీ అవి అంతకంటే ఎక్కువే. తల్లిపాలు పోషకాలను అందిస్తాయి. అంటు వ్యాధుల నుంచి రక్షిస్తాయి. మేధో వికాసానికి తోడ్పడతాయి. భవిష్యత్తులో ఊబకాయం, అసాంక్రమిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. రొమ్ము, అండాశయ క్యాన్సర్లు, టైప్–2 డయాబెటిస్ ముప్పును తగ్గించి తల్లి ఆరోగ్యానికి దోహదపడతాయి.

భారత్‌లో తల్లిపాల సూచీల్లో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్)-6 డేటా తెలియజేస్తోంది. త్వరగా తల్లిపాలు అందించడం అంటే శిశువు పుట్టిన తొలి గంటలోనే పాలు పట్టించడం 41.8 శాతం నుంచి 50.1 శాతానికి పెరిగింది. ఇది ముఖ్యమైన పురోగతే. ఎందుకంటే.. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించేలా చూడటానికి, నవజాత శిశువు రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి బిడ్డ పుట్టిన తొలి గంట చాలా కీలకమైనది.

సాధారణంగా చనుబాలు పట్టించడాన్ని తల్లి బాధ్యతగా మాత్రమే చూస్తారు. వాస్తవానికి అది ఉమ్మడి బాధ్యత. ఈ విషయంలో తల్లులకు సరైన సాయం అవసరం. ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి, సాధారణ సమస్యలను పరిష్కరించడానికి చూలింతగా ఉన్న సమయంలోనూ, ప్రసవం జరిగిన వెంటనే వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం అవసరం. ఇబ్బందులు ఎదురైనప్పుడు శిక్షణ పొందిన ఆరోగ్య కార్యకర్తలు, తల్లిపాలను అందించడంలో తోడ్పాటును అందించే నిపుణులు అందుబాటులో ఉంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ విషయంలో బాలింతలను ప్రోత్సహించడం, ఇంటి బాధ్యతలను పంచుకోవడం, అనుకూలమైన వాతావరణాన్ని అందించడం ద్వారా కూడా కుటుంబాలు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. వేతనంతో కూడిన ప్రసూతి సెలవు, సౌకర్యవంతమైన పని వాతావరణం, తల్లిపాలు అందించడానికి విరామాలు, చనుబాలను తీసి, నిల్వ చేయడానికి సురక్షితమైన ఏర్పాట్లతో సహా ఉద్యోగాలు చేసే మహిళలకు అనుకూలమైన కార్యాలయ విధానాలు చాలా అవసరం. కుటుంబం, సమాజం, ఆరోగ్య వ్యవస్థలు, సంస్థలు, ప్రభుత్వాలు కలసి పనిచేస్తే తల్లులు మరింత విజయవంతంగా శిశువుకి పాలను అందించగలుగుతారు. ప్రతి బిడ్డ జీవితానికీ సాధ్యమైనంత ఆరోగ్యమైన ఆరంభాన్ని అందించగలుగుతారు.

ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–4, ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–5 డేటాను విశ్లేషించి చేపట్టిన ఓ అధ్యయనంలో ప్రసవానికి పూర్వం ఎక్కువ సార్లు వైద్యులను సంప్రదించిన వారు, ప్రజారోగ్య కేంద్రాల్లో ప్రసవించిన వారు తమ శిశువులకు తల్లిపాలను మాత్రమే ఇస్తున్నారని తేలింది. దీనికి విరుద్ధంగా 20 ఏళ్ల కంటే తక్కువ వయసున్న తల్లులు, తక్కువ బరువుతో పుట్టిన శిశువులు, ప్రసవం జరిగిన గంట తర్వాతే చనుబాలు ఇవ్వడం ప్రారంభించిన సందర్భాల్లో తల్లిపాలను మాత్రమే ఇచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటోంది. శిశువుకు తల్లిపాలను అందించేలా చేయడంలో ఆరోగ్య వ్యవస్థ అందిస్తున్న కౌన్సెలింగ్, తోడ్పాటు ఎలా సహకరిస్తున్నాయో ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

"సత్ఫలితాలిస్తున్న చర్యలను మరింత బలోపేతం చేద్దాం" అని ఈ ఏడాది ఇతివృత్తం స్పష్టం చేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ఉన్న కార్యక్రమాలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. శిశువులు, బాలల్లో పోషకాహార లేమి సమస్యను పరిష్కరించడానికి బిహేవియర్ ఛేంజ్ కమ్యూనికేషన్ (బీసీసీ)ను ముఖ్యమైన వ్యూహంగా మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న పోషణ్ అభియాన్ కార్యక్రమం గుర్తించింది. వార్షిక విధానంలో నిర్వహించే పోషణ మాసం, పోషణ పక్షోత్సవాల ద్వారా అవగాహనను పెంపొందించడం, కౌన్సెలింగ్ సేవలను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తల భాగస్వామ్యాన్ని విస్తరించడం ద్వారా తల్లిపాలు, నవజాత శిశువులు, బాలల పోషణ అంశాలను ఈ కార్యక్రమం జాతీయ స్థాయిలో ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చింది. అయినప్పటికీ సమాజ ఆధారిత వేదికల విస్తృత సహకారం ద్వారా ఈ ప్రయత్నాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

తల్లిపాలు తగినంత లభించకపోవడం వల్ల ప్రతి ఏటా డయేరియా, తీవ్రమైన శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్ల కారణంగా 73,417 శిశు మరణాలు సంభవిస్తున్నాయని, అదే సమయంలో దీనివల్ల ఏటా సుమారు 16.6 బిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక భారం పడుతోందని కూడా అంచనా. 2030 నాటికి 70 శాతం చిన్నారులకు తల్లిపాలను మాత్రమే అందించాలని ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే తమకెదురైన అడ్డంకులను అధిగమించేలా తల్లులకు తోడ్పడే విధానాలు కార్యక్రమాలు అవసరం. అదేవిధంగా పుట్టిన వెంటనే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలూ తల్లిపాలను మాత్రమే ఇవ్వడం, ఆ తర్వాత కూడా తల్లిపాలను కొనసాగించేలా వారికి తగిన సహకారాన్ని అందించాల్సిన అవసరం కూడా ఉంది.

పుట్టిన వెంటనే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలూ తల్లిపాలను మాత్రమే ఇవ్వడం, ఆ తర్వాత కూడా వాటిని కొనసాగించడంలో వృద్ధిని నమోదు చేసేందుకు నిధులను పెంపొందించడం, ఇన్ఫాంట్ మిల్క్ సబ్‌స్టిట్యూట్స్ (ఐఎంఎస్) చట్టాన్ని కఠినంగా అమలు చేసి నిబంధనలను ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించడం, అన్ని రంగాల్లోనూ ఈ చట్టాన్ని స్వీకరించేలా ప్రోత్సహించడం, కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవులు, కార్యాలయ నిబంధనలు, ప్రసూతి కేంద్రాల్లో తల్లిపాలను ఇచ్చేలా ప్రోత్సహించేందుకు 10 దశల విధానాన్ని స్వీకరించడం, ఆరోగ్య కేంద్రాలు, సమాజాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం ద్వారా తల్లిపాలను అందించేలా నిపుణుల కౌన్సిలింగ్‌ను అందుబాటులోకి తీసుకురావడం, తల్లిపాల లక్ష్యాల పురోగతిని పర్యవేక్షించడానికి, బలమైన మానిటరింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం లాంటి విధానపరమైన చర్యలకు గ్లోబల్ బ్రెస్ట్ ఫీడింగ్ కలెక్టివ్ పిలుపునిస్తోంది.

భారతదేశంలో ఇప్పటికే అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల్లో "సత్ఫలితాలిస్తున్న చర్యలను మరింత బలోపేతం చేద్దాం" అనే ఈ ఏడాది ఇతివృత్తం ప్రతిఫలిస్తోంది. తల్లిపాల ప్రాధాన్య సందేశాలను విస్తృతంగా ప్రజలకు చేరువ చేసేందుకు బీసీసీ, సమాచార, అవగాహన, ప్రచార కార్యక్రమాలను మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కొనసాగిస్తోంది. వీటితో పాటుగా ఫార్ములా పాల మార్కెటింగ్‌లో అక్రమాలను అరికట్టేందుకు ఐఎంఎస్ చట్టం అమలును బలోపేతం చేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న పోషణ్ ట్రాకర్ లాంటి డిజిటల్ పరిష్కారాలు అంగన్వాడీల ద్వారా అందించే సేవలను సమర్థమైన రీతిలో పర్యవేక్షించేందుకు తోడ్పడుతున్నాయి. అలాగే ఇంటి నుంచే మెరుగైన వ్యక్తిగత కౌన్సిలింగ్ సేవలను అందించే సాధనాలను యాప్‌లోనే అందిస్తున్నాయి. శిశువు పుట్టినప్పటి నుంచి తల్లిపాల సూచీలను పర్యవేక్షించే వీలును కూడా కల్పిస్తాయి. ఆరోగ్య కార్యకర్తలతో గృహ సందర్శనలను సమన్వయం చేసేందుకు ఇటీవలే ప్రారంభించిన 'హోమ్ విజిట్ షెడ్యూలర్', సమగ్ర సమాచారంతో కూడిన వీడియోలను లబ్ధిదారులకు అందించే బెనిఫిషియరీ మాడ్యూల్ లాంటివి ఇప్పటికే అమలవుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఉన్నాయి. భారత్‌లో తల్లిపాలను అందించడంలో అంతరాన్ని పూడ్చడానికి, దేశ నిర్దేశించుకున్న పోషకాహార లక్ష్యాలను, 2030 ప్రపంచ లక్ష్యాన్ని సాధించడానికి ఆరోగ్యం, పోషకాహార వ్యవస్థల్లో ఈ ప్రయత్నాలను బలోపేతం చేయడం కీలకంగా మారుతుంది.

(రచయితలు అనువాద్ సొల్యూషన్స్‌లో రీసెర్చి లీడ్, న్యూట్రిషన్ లీడ్‌గా వ్యవహరిస్తున్నారు)

# భారత్–రష్యా స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసే వేదికగా వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయం నిలవాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**

హైదరాబాద్‌లో వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయాన్ని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ హెడ్ డాక్టర్ రాయల నీతు నాయుడు తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, భారత్–రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహం పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి నిదర్శనమని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ పారిశ్రామికాభివృద్ధి, ఉక్కు కర్మాగారాలు, భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటులో అప్పటి సోవియట్ యూనియన్ అందించిన సహకారం చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధుల భావనకు కూడా సోవియట్ రాజ్యాంగం ప్రేరణగా నిలిచిందని గుర్తుచేశారు. రక్షణ, విజ్ఞానం, అంతరిక్షం, సాంకేతికత, ఇంధనం, విద్య వంటి అనేక రంగాల్లో భారత్–రష్యా సంబంధాలు మరింత బలపడుతున్నాయని మంత్రి తెలిపారు. మహిళలకు రాజకీయ, సామాజిక జీవితంలో సముచిత స్థానం కల్పించడంలో రష్యా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల కల్పన, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయం ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యాపారం, పర్యాటకం, సంస్కృతి, పరిశోధన, ఆవిష్కరణలు, ప్రజల మధ్య పరస్పర సహకారం వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.హైదరాబాద్ చారిత్రక వారసత్వంతో పాటు సాంకేతిక రంగంలో ప్రపంచ గుర్తింపు పొందిన నగరమని పేర్కొన్న మంత్రి, ఈ కార్యాలయం భారతదేశం–రష్యా ప్రజల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్నేహం, శాంతి, అభివృద్ధి, సాంస్కృతిక అవగాహనకు దోహదపడే ప్రతి కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



# ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే వివేకానంద్ పాదయాత్ర

- **బౌరంపేట్ సమగ్రాభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నాం:ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 05 (వెలుతురు) :**

సిఎంసి దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేట్ లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి బుధవారం పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు సీఆర్ఎంపీ రోడ్డు నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ, వాహనాల రద్దీ వంటి సమస్యలను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దృష్టికి తీసుకొచ్చారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేగంగా విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా వెలుస్తున్న కాలనీల్లో ప్రజల మౌలిక వసతులను తీర్చేందుకు ప్రణాళిక బద్ధంగా భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి వసతితో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి అభివృద్ధి పరుస్తామని అన్నారు. డిపిఎస్ స్కూల్ – బొ్డ్రాయి ప్రధాన సిఆర్ఎంపి రహదారిలో భారీ వాహనాల రద్దీతో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిపై సిఎంసి కమిషనర్ సృజన, ఈఈ రత్నాకర్ తో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే సిఆర్ఎంపి రోడ్డును వెంటనే అభివృద్ధిపరచాలన్నారు. భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారినందున భారీ వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ ని క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలన్నారు.భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తూ ఎగువ ప్రాంతంలోని



మురుగు నీటిని ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా మళ్లింపు చేపట్టి భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో డీప్యూటీ కమిషనర్ వెంకట మణికిరణ్, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ పాపమ్మ, ఏఈ సురేందర్ నాయక్, డీజీఎం ప్రమీలా, ఏఈ వెంకటేష్, విద్యుత్ ఏఈ సాయికిరణ్, పోలీస్ అధికారులు, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, బెంబడి బుచ్చిరెడ్డి, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాదాసు వెంకటేష్, విష్ణువర్ధన్ రెడ్డి, మురళీయాదవ్, హనుమంత్ రావు, సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి, సాయిరెడ్డి, మన్నె శేఖర్ ముదిరాజ్, సాంబశివరెడ్డి, బొబ్బ శ్రీనివాస్ రావులు పాల్గొన్నారు.

# హరీష్ రావుపై కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారం

- **అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు...**
- **మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తం....**

**జహీరాబాద్వెలుతురు ఆగస్టు 06:**

తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి. హరీష్ రావు క్షుద్రపూజలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకుల అవివేకానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు.తెలంగాణ ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రం పచ్చగా కళకళలాడాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకునే నాయకుడు హరీష్ రావు అని నరోత్తం పేర్కొన్నారు. అలాంటి నాయకుడిపై క్షుద్రపూజలు చేశారంటూ ఆరోపణలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు సమాధానాలు చెప్పలేక, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై, ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ నాయకులు ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని



ఆరోపించారు. ఇలాంటి రాజకీయ ఆరోపణలను రాష్ట్రం పచ్చగా కళకళలాడాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకునే నాయకుడు హరీష్ రావు అని నరోత్తం పేర్కొన్నారు. ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

హరీష్ రావు ప్రతిష్టను దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు వెంటనే ఉపసంహరించుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని వై. నరోత్తం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శంకర్, చంద్రశేఖర్ రెడ్డి, శివకుమార్, ఎస్. గోపాల్, సి.ఎం. విష్ణువర్ధన్ రెడ్డి, ఎం.డి. సలీమ్, బాల్‌రాజ్, కీరు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ కార్మిక విభాగ
# కో-కన్వీనర్‌గా తలూరి రాము



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 05 (వెలుతురు):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ చెందిన తలురి రాము, మేడ్చల్ జిల్లా కార్మిక విభాగం కో–కన్వీనర్ గా రాష్ట్ర కార్మిక విభాగం కన్వీనర్ శ్రీనివాస్ నియామించారు. ఈ సందర్భంగా ఆయన మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి మరియు మహంకాళి ఇంచార్జ్ నందన దివాకర్ , బిజెపి సీనియర్ నాయకులు బాలచందర్ వర్మ మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి నాయకులు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్మికుల పక్షాన పని చేస్తానని తెలిపారు.తనకు అందరూ సహకరించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకులు, డివిజన్ నాయకులు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# సిపిఐ తలపెట్టిన బదలావ్ జరూరి హై ప్రచార యాత్ర వాల్ పోస్టర్లు విడుదల

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 05 (వెలుతురు):**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ఆధ్వర్యంలో తలపెట్టిన (బదలావ్ జరూరి హై) మార్పు కావాలి వాల్ పోస్టర్లు నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహ కల్పలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అవలభిస్తున్న ప్రజా, రైతు, విద్యార్థి, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో చేపడుతున్న సెప్టెంబర్ 1వ తేదీన ఛలో డిల్లీ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 06 నుండి 14వరకు ప్రచార యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భారత దేశం అభివృద్ధి చెందాలంటే మార్పు కావాలని (బదలావ్ జరూరి హై) అన్నారు.



ఇటీవల పేపర్ లీకేజీలు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలు, నూతన రైతు వ్యతిరేక చట్టాలు, నిరుద్యోగ యువత పెరగడం ప్రజలు మార్పు కోరుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ ప్రచార యాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పొన్నాకంటి దస్తగిరి, రాము, పుష్పమ్మ, సత్తమ్మ, లక్ష్మి , కవిత, నర్సమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

# ఆగస్టు 17 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు?



- **డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై కేంద్రం దృష్టి**
- **ఆగస్టు 17 నుంచి మూడు రోజుల ప్రత్యేక సమావేశాలకు కసరత్తు**
- **ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది**
- **మూడింట రెండు వంతుల మెజారిటీ సమీకరణపై ప్రభుత్వ ప్రయత్నాలు**
- **రిజిజు అభ్యర్థనను తిరస్కరించిన రాహుల్ గాంధీ**
- **అమిత్ షా ప్రకటన వరకు సభ నడవదన్న కాంగ్రెస్**
- **ప్రతిష్టంభన నివారణపై స్పీకర్‌తో కేంద్ర మంత్రుల చర్చ**

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 5:**

ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13తో ముగియనున్న నేపథ్యంలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఆగస్టు 17 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే పార్లమెంట్‌ను నిరవధికంగా వాయిదా వేయకుండా, అవసరమైతే ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రతిపాదిత రాజ్యాంగ సవరణ బిల్లులకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. సంఖ్యాబలం ఖరారైన తర్వాతే ప్రత్యేక సమావేశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.ఇదిలా ఉండగా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. బుధవారం ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య లోక్‌సభ ప్రారంభమైన కొద్ది నిమిషాలకే వాయిదా పడింది.ఈ నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఆయన ఛాంబర్‌లో కలిసి డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులకు సహకరించాలని కోరారు. అయితే ఆ అభ్యర్థనను రాహుల్ గాంధీ తిరస్కరించినట్లు సమాచారం.అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ, ఎస్‌సీజేపీ నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల చర్యల అంశాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేసే వరకు సభా కార్యక్రమాలు సజావుగా సాగవని రాహుల్ స్పష్టం చేసినట్లు సమాచారం. అనంతరం పార్లమెంట్ ప్రతిష్టంభనపై చర్చించేందుకు కిరణ్ రిజిజు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హోంమంత్రి అమిత్ షాలతో సమావేశమైనట్లు తెలుస్తోంది.

# నేడే సచివాలయంలో రాష్ట్ర మంత్రులతో కరీంనగర్ అభివృద్ధిపై కీలక సమీక్ష

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 05:**

నగర సమగ్ర అభివృద్ధి, ప్రత్యేక నిధుల సాధనపై మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రత్యేక ప్రతిపాదనలుకరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై నేడే (ఆగస్టు 6) హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గౌరవ రాష్ట్ర మంత్రివర్యులతో నిర్వహించనున్న ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొననున్నారు.ఈ సమావేశంలో కరీంనగర్ నగరంలో చేపట్టాల్సిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, రహదారుల అభివృద్ధి, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వరద నివారణ చర్యలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, పట్టణ సుందరీకరణతో పాటు ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించే అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు.అదే విధంగా నగర అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధుల కేటాయింపు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద చేపట్టాల్సిన ప్రాజెక్టులు, ఇప్పటికే కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్ర మంత్రివర్యులకు మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు సమగ్ర నివేదిక సమర్పించనున్నారు. నగరానికి అవసరమైన ప్రత్యేక నిధులు, పరిపాలనా సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు.కరీంనగర్ నగరాన్ని ఆధునిక, అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని కార్యాలయం పేర్కొంది.

# మాజీ కౌన్సిలర్ బెల్లాలా పోతన్న పార్థివ దేహానికి నివాళులర్పించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాదు వెలుతురు ఆగస్టు 05:**



నిజామాబాద్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ బెల్లాలా పోతన్న పార్థివ దేహానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పోతన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు శేఖర్ గౌడ్, కేశ వేణు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, దయాకర్ గౌడ్ తదితరులు పాల్గొని బెల్లాలా పోతన్నకు నివాళులర్పించారు.

# బోలక్‌పూర్‌లో ఘనంగా బీరప్ప, అక్క మహంకాళి బోనాలు

- **ఘనంగా కురుమ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు**
- **డప్పు చప్పుళ్లు, బోనాలు తో వైభవంగా ఊరేగింపు**

**కూకట్ పల్లి ఆగస్టు 5 (వెలుతురు):**

బోలక్‌పూర్ డివిజన్ పరిధిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప, అక్క మహంకాళి బోనాల పండుగను అత్యంత వైభవంగా, నిర్వహించారు. కుల పెద్దలందరి ఆధ్వర్యంలో ఈ వేడుకలు కన్నుల పండుగగా సాగాయి.ఈ సందర్భంగా భక్తులు తొలుత బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్క మహంకాళి అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. బీరప్ప ఆలయం నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు ప్రధాన వీధుల గుండా అక్క మహంకాళి గుడి వరకు కోలాహలంగా కొనసాగింది.సంప్రదాయ డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపు మార్గమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి, బీరప్ప





స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, కుల పెద్దలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఉత్సవాల అనంతరం భక్తులకు అమ్మవారి ప్రసాద వితరణ చేపట్టారు.

# ప్రజల కోసం పనిచేయాలి
## కోలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ) ఆగస్టు 05:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పరిధిలోని సాయిబాబానగర్ కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు చందు ముదిరాజ్ జన్మదినం సందర్భంగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా హన్మంత్ రెడ్డి చందు ముదిరాజ్కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. వారు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికిరణ్ పటేల్, డీసీసీ కమిటీ సభ్యులు గోరికర్ కరణ్, నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ గఫ్ఫార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింహా గౌడ్, రాజిరెడ్డి, రాంచందర్, నగేష్ రెడ్డి, అంజిరెడ్డి, యాసిన్, యూత్ కాంగ్రెస్ నాయకులు జానీ, అజ్జు, సన్నీ, శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షునికి సన్మానం



**మోత్కూర్, ఆగస్టు 05, (వెలుతురు) :**

మోత్కూర్ మున్సిపాలిటీలో సెంట్రింగ్ యూనియన్ మండల అధ్యక్షులుగా ఎన్నికైన బి. ఆర్. ఎస్. మాజీ కార్మిక విభాగం అధ్యక్షులు జంగ సతీష్ ను బి. ఆర్. ఎస్. నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం పోరాడాలని భవిష్యత్తులో మరిన్ని పదవులను పొంది కార్మికుల హక్కుల కోసం పనిచేయాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బి. ఆర్.ఎస్. మున్సిపల్ అధ్యక్షులు జంగ శ్రీను,యువజన నాయకులు కూరెళ్ళ పరమేష్ ,చేతరాశి వెంకన్న,మొరిగాల శ్రీను,చుక్క అశోక్,కూరెళ్ళ రమేష్,వడకాల యాదగిరి, బందెల శ్రీను,అన్నందాసు మచ్చగిరి,ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల్లో దివ్యాంగులకు 4% రిజర్వేషన్ అమలు చేయాలి

- **విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర కమిటీ**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 05:**

దివ్యాంగుల రోస్టర్ ప్రకటించి మినహాయింపు పోస్టులను స్పష్టం చేయాలి. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల లో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 7437 పోలీసు శాఖ ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకాల్లో వికలాంగుల హక్కుల చట్టం–2016 ( ఆర్ పి డబ్ల్యు డి ఆక్ట్ 2016 ) ప్రకారం దివ్యాంగులకు కల్పించాల్సిన 4 శాతం రిజర్వేషన్ ప్రకారం 300 పోలీస్ శాఖ ఉద్యోగాలను రోస్టర్ ప్రకారం దివ్యాంగుల 4 శాతం రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర కమిటీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. పోలీసు నియామకాల్లో ఏయే పోస్టులు దివ్యాంగులకు అనుకూలమో శాస్త్రీయంగా పరిశీలించి, చట్టబద్ధంగా దివ్యాంగుల రోస్టర్‌ను ప్రకటించాలి. అలాగే దివ్యాంగులకు అనుకూలం కాని పోస్టులు ఉంటే, వాటిని చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా స్పష్టమైన మినహాయింపు ఉత్తర్వులతో ప్రకటించాలి. ఎలాంటి కారణాలు చూపకుండా దివ్యాంగులను పూర్తిగా నియామకాల నుండి దూరంగా ఉంచడం రాజ్యాంగ స్ఫూర్తికి, వికలాంగుల హక్కుల చట్టం–2016కు విరుద్ధం.కాబట్టి తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీసు నియామక మండలి వెంటనే పోలీసు నియామక నోటిఫికేషన్‌ను పునఃసమీక్షించి, దివ్యాంగులకు 4% రిజర్వేషన్ అమలు చేస్తూ పోస్టుల వారీగా రోస్టర్‌ను ప్రకటించాలని, దివ్యాంగులకు అనువైన పోస్టులను గుర్తించి వారికి సమాన అవకాశాలు కల్పించాలని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

డిమాండ్లు: వికలాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం 4% రిజర్వేషన్‌ను పూర్తిగా అమలు చేయాలి.

పోలీసు శాఖలో దివ్యాంగులకు అనువైన పోస్టుల రోస్టర్‌ను విడుదల చేయాలి. 7 437 పోస్టులలో దివ్యాంగులకు 300 పోస్టులు నింపి రాజనీతి నిరూపించుకోవాలి. లేని పక్షంలో రాజ్యాంగ ప్రకారం ముందుకు సాగి దివ్యాంగులకు రిజర్వేషన్ సాధిస్తామని విశ్వ విద్యాలయాల దివ్యాంగుల



ఫోరం తెలిపింది. దివ్యాంగుల హక్కులను పరిరక్షిస్తూ సమాన ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ అశోక్ ,విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ , జనరల్ సెక్రెటరీ ఆంజనేయులు గౌడ్, ,మొరిగాడి నరసింహ గౌడ్, మొక్క ఉపేందర్, ధనమ్మ జనమ్మ, కర్ణాకర్ వెంకటేష్ జగన్, వెంకట్ దివ్యంగా విద్యార్థులు నాయకులు పాల్గొన్నారు.

# సర్పంచ్ కంచి మధుసూదన్ ఆధ్వర్యంలో గ్రామంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 05:**

శోభనాద్రిపురం గ్రామంలో సర్పంచ్ కంచి మధుసూదన్ ఆధ్వర్యంలో గ్రామం లో మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించి, నాలుగు రకాల చెత్త వేరు చేసే ప్రక్రియ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. అదే విధంగా ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని,తద్వారా భూగర్భ జలాన్ని పెంచుకోవాలని, పారిశుద్ధ సమస్యలు తలెత్తకుండా ఉంటాయని ప్రజలకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ పాలక వర్గ సభ్యులు, గ్రామ లైన్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్ భరో

- **సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గొరిగే సోములు**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 05:**

గ్రామం కక్కిరేణి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించనున్న "జైల్ భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గొరిగే సోములు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కక్కిరేణి గ్రామంలో కార్మికులతో కలిసి జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గొరిగే సోములు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సమరంలో కీలక మలుపు తిప్పిన క్విట్ ఇండియా ఉద్యమం ప్రజలకు పోరాట స్ఫూర్తిని, ఐక్యతను అందించిందన్నారు. అదే స్ఫూర్తితో నేడు ప్రజల హక్కుల పరిరక్షణ, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కర్మిక వర్గ సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10న "జైల్ భరో" కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువ



తతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా, వర్గ సంఘాల నాయకులు కన్నెబోయిన యాదయ్య , వేముల సైదులు , గ్రామ కార్మికులు బడే సత్తయ్య , కోట వెంకన్న , కిన్నెర రమేష్, కట్ట భిక్షం, నర్సింహ, యశోద పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్ కొరకు సమయం పెంపు

- **ప్రధాన చార్యులు ఆచార్య రహత్ ఖానం**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 05:**



డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశంగా దోస్తు స్పెషల్ డ్రైవ్ ఫేస్ షెడ్యూల్ విడుదలైందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలియజేశారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 6 నుంచి 11 వరకు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వెబ్ ఆప్షన్ ఈనెల 6 నుంచి 12 వరకు ఆయా కళాశాలలోని ఆయా కోర్సులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 14న సీట్ల కేటాయింపు జరగగా 14 నుండి 18 వరకు ఆన్లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని సూచించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన విద్యార్థులు 17, 18 తేదీల్లో ఇంటర్మీడియట్ ఒరిజినల్ టి.సి. సర్టిఫికెట్ తో పాటు ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో కళాశాలకు విచ్చేసి అడ్మిషన్ కు సంబంధించిన కన్ఫర్మేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే కళాశాలలో కన్ఫర్మేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నవారు. ఇంట్రా కాలేజ్ ఫేస్.2 ద్వారా ఆగస్టు 20,21 తేదీల్లో విద్యార్థులు తమ దోస్త్ వ్యక్తిగత లాగిన్ ద్వారా కళాశాల స్థాయిలో కోర్సు మార్పు కోసం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని ఇందుకు సంబంధించిన సీట్ల కేటాయింపు 22న జరుగుతుందని తెలియజేశారు. ఇది అడ్మిషన్లకు సంబంధించి చివరి అవకాశం కాబట్టి ఇప్పటివరకు ఏ కళాశాలలో కూడా పొందని ప్రతి విద్యార్థి తప్పకుండా ఆన్లైన్ ద్వారా గాని కళాశాల కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసు కొని అడ్మిషన్లు పొందాలని తెలియజేశారు. సకల సదుపాయాలు, సుదీర్ఘ అనుభవముగల ప్రతిభావంతులైన అధ్యాపకులు గల స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరారు.

# దిడిగిలో వీవో భవన నిర్మాణానికి భూమిపూజ

- **కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. నరసింహ రెడ్డి...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం దిడిగి గ్రామంలో రూ.10 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న వీవో భవనానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. నరసింహ రెడ్డి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ వి. రాములు, సీనియర్ నాయకులు కే. నర్సింలు, సీడీసీ డైరెక్టర్ జి. మల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ జగదాంబ సోమశేఖర్, ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, డిప్యూటీ సర్పంచ్ సురేష్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి రమ్య సాంసన్, వార్డు సభ్యులు ఆశప్ప, రాజు, నగేష్, సీఏ లక్ష్మమ్మ, జి. రాములు తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# బోనాల జాతర ప్రచారంలో ఎరుకొండ నాగరాజు

- **201 బోనాలతో రేణుక ఎల్లమ్మ తల్లికి కుమ్మరుల మహా సమర్పణ ఆగస్టు 16న ఘనంగా బోనాల జాతర**

**నల్లగొండ ఆగస్టు 05 వెలుతురు:**

శ్రావణమాసం తొలి బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆగస్టు 16న ధర్వేశిపురంలోని సదాశివ ఫంక్షన్ హాల్ వద్ద కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి కుమ్మరులు 201 బోనాలు సమర్పించే మహోత్సవం నిర్వహించనున్నారు.జాతర నిర్వహణకు సంబంధించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని నల్లగొండ ఓల్డ్ సిటీ మైసూర్ నగర్ సంఘం టౌన్ అధ్యక్షులు ఊట్కూర్ లింగయ్య, సంఘ భవన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం జిల్లా మీడియా విభాగ అధ్యక్షులు ఎరుకొండ నాగ రాజు గారు ప్రత్యేకంగా పాల్గొన్నారు. జాతర విశేషాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, కుమ్మర కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించడంలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు. జాతర ప్రచారం, సమాచార సమన్వయం, కార్యక్రమ విశేషాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎరుకొండ నాగరాజు గారి కృషి అభినందనీయమని సంఘ నాయకులు





పేర్కొ న్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం మాట్లాడుతూ, శ్రావణమాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం కుమ్మరుల సంప్రదాయానికి ప్రతీక అని అన్నారు. ఈసారి రేణుక ఎల్లమ్మ తల్లికి 201 బోనాలు సమర్పించే మహోత్సవంలో సుమారు 3,000 మంది కుమ్మరులు పాల్గొని జాతరను చారిత్రాత్మక విజయంగా నిలపాలని పిలుపునిచ్చారు. యువత సంప్రదాయాలను కొనసా గిస్తూ కుమ్మరుల సంస్కృతి, ఆచారాలను భావితరాలకు అందించాలని సూచించారు. జాతర ఏర్పాట్లలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహ రించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.జాతర ప్రచారం, సమాచార సమన్వయం, కార్యక్రమ విశేషాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎరుకొండ నాగరాజు గారి కృషి అభినందనీయమని సంఘ నాయకులు పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గ అధ్యక్షులు, మండల కన్వీనర్లు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు, జిల్లా మీడియా విభాగ అధ్యక్షులు ఎరుకొండ నాగరాజు, సంఘ పెద్దలు, మహిళలు, యువ కులు, పెద్ద సంఖ్యలో కుమ్మర కులస్తులు పాల్గొ న్నారు.ఆగస్టు 16న జరిగే శ్రావణమాసం తొలి బోనాల జాతరకు ప్రతి గ్రామం నుంచి కుమ్మర కుటుంబాలు పెద్ద ఎత్తున తరలివచ్చి 201 బోనాలతో రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని జాతరను విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# సీతారాంపురం, సుద్దాల గ్రామాల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**గుండాల, ఆగస్టు 5 (వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని సీతారాంపురం, సుద్దాల గ్రామాల అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాంపురం గ్రామ సెక్రటరీ బొట్ల విజయ మాట్లాడుతూ, నవజాత శిశువులకు పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని తెలిపారు. తల్లిపాలలోనే శిశువుల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి తల్లి సమతుల్య ఆహారంగా ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, పండ్లు తీసుకోవడం ద్వారా శిశువులు ఆరోగ్యంగా పెరిగి, వయస్సుకు తగిన బరువుతో ఉంటారని





సూచించారు. ముఖ్యంగా పుట్టిన వెంటనే ముర్రుపాలు (కొలస్ట్రం) తప్పనిసరిగా శిశువులకు అందించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు కాళి పద్మ వెంకన్న, గడ్డమీది మహోదయ, ఉపసర్పంచ్ మల్లెపాక నరేష్, నగేష్.అంగన్వాడీ టీచర్లు జి. వాణి, మౌనిక, ఏఎన్ఎంలు రేణుక, రజియా, గంజి వెంకటేశం, వడ్లకొండ మల్లేష్, ఆశా కార్యకర్తలు కవిత , ఆయాలు మంజుల, గర్భిణీలు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అక్రమంగా మొక్కలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**యాదగిరిగుట్ట , ఆగస్టు 05 (వెలుతురు) :**

యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో 122 సర్వే నెంబర్ లో గల ప్రభుత్వ భూమిలో ఇటీవల తాము ఉపాధి హామీ పథకం కింద సుమారు 500 ల మొక్కలను నాటించగా వాటిని అక్కడ ఒక ప్రైవేటు వెంచర్ కి చెందిన వ్యక్తులు అక్రమంగా మొక్కలను తొలగించారని వంగపల్లి గ్రామ సర్పంచ్ ఒగ్గు రవళి రాణా ప్రతాప్ తెలిపారు. అక్రమంగా మొక్కలు తొలగించిన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఇప్పటికే తాము అటవీ శాఖ అధికారులకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ అంశాన్ని స్థానిక ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. 122 సర్వే నెంబర్ లో సుమారు 17 గుంటల ప్రభు త్వ భూమి ఉందని తెలిపారు. ఈ భూమిలో తాము సుమారు 500 ల మొక్కలను ఉపాధి హామీ





కూలీలతో నాటించామని చెప్పారు. ఎవరికి తెలియకుండా , ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్కడ ఉన్న ప్రైవేటు వెంచర్ కు సంబంధించిన వ్యక్తులు పూర్తిగా మొక్కలను తొలగించి పక్కన పడేశారని తెలిపారు. ప్రభుత్వ భూమి నుండి అక్రమంగా వారి వెంచర్ కు రోడ్డు వేయించుకున్నారని ఇది నిబంధనలకు విరుద్ధమని అన్నారు . ఇప్పటికైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించి రోడ్డు వేసుకున్న వారు తక్షణమే అక్కడినుండి తప్పుకోవాలని అన్నారు . లేకపోతే తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటా మని అన్నారు. ప్రభుత్వ భూమి ప్రజలకు సంబంధించిందని ఆ ప్రభుత్వ భూమి వంగపల్లి గ్రామ ప్రజలకు , వంగపల్లి గ్రామానికి ఉపయోగపడేలా చేస్తామని అన్నారు. ఉపాధి హామీ పథ కం కింద నాటిన మొక్కలను తొలగించిన వెంచర్ నిర్వాహకులపై సంబంధిత అధికారులు కఠిన చర్య లు తీసుకునేకు పోరాడుతా మని అన్నారు. వెంట స్థానికులు, గ్రామస్తులు ఉన్నారు.

# జాతీయ ఓబీసీ మహాసభకు హరిప్రసాద్‌కు ఆహ్వానం

**మునుగోడు,ఆగస్ట్ 5 (వెలుతురు):**

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మార్గదర్శకత్వంలో ఆగస్టు 7న బెంగళూరులో జరగనున్న 11వ జాతీయ ఓబీసీ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు బి.కె. హరిప్రసాద్ ను బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్ బీసీ ప్రతినిధులతో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా విజయ్ గౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహణ, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు, ఓబీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల సాధనే మహాసభ



ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ ఉద్యమానికి హరిప్రసాద్ మద్దతు బీసీ సమాజానికి బలాన్నిస్తుందని పేర్కొన్నారు. ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన హరిప్రసాద్ మహాసభకు హాజరవుతానని హామీ ఇచ్చినట్లు విజయ్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ ప్రతినిధులు భవన్ రామ్ తైవడే,సచిన్ రాజోర్‌కార్,తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్ కురుమ, రావుల కోల్ నరేష్ ప్రజాపతి, పాల్గొన్నారు.

# బాధితులకు బరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 05:**



నకిరేకల్ శాసనసభ్యులు తెలంగాణ ప్రభుత్వ విప్ వేముల వీరేశం సహాయ సహకారంతో మంజూరైనటు వంటి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు రామన్నపేట మండలం వివిధ గ్రామాల చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ వార్డు సభ్యులు మోటే మహేష్, కందుల అండాలు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ అంజిరెడ్డి, అక్క యాదయ్య, పిట్ట రామిరెడ్డి, శంబాల వెంకన్న, చింతల కృష్ణ, గొలుసుల ప్రసాద్, మాల్గా వెంకటేష్, బండ బాలరాజ్, బొడ్డు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల దుర్వినియోగం నిరూపిస్తే ఎలాంటి చర్యలకైనా సిద్ధం

- **గుంజెటి గ్రామపంచాయతీలో అవకత వకల ఆరోపణలు అవాస్తవం...**
- **గుంజెటి గ్రామ సర్పంచ్ దేశెట్టి పాటిల్...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**



గుంజెటి గ్రామపంచాయతీలో సర్పంచ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఇటీవల పలు పత్రికల్లో వచ్చిన కథనాలను సర్పంచ్ దేశెట్టి పాటిల్ తీవ్రంగా ఖండించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం గుంజెటి గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనపై వచ్చిన ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని స్పష్టం చేశారు.డిసెంబర్ 16న సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటివరకు గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నానని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటిని ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. వ్యక్తిగత కక్షలు, రాజకీయ వివాదాలకు తాను ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు.ఇటీవల గ్రామంలో నిర్మించిన మురికి కాలువపై కూడా కొందరు అనవసర ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ పేర్కొన్నారు. సుమారు రెండు వారాల క్రితం నిర్మించిన కాలువకు భారీ వర్షాల కారణంగా స్వల్పంగా కుంగుబాటు ఏర్పడిందని, నిర్మాణ నాణ్యతలో ఎలాంటి లోపం లేదని తెలిపారు. విషయం గుర్తించిన వెంటనే సంబంధిత గుత్తేదారు మరమ్మతులు చేపట్టి సమస్యను సరిచేశారని వివరించారు.గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేశానంటూ అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని దేశెట్టి పాటిల్ అన్నారు. గ్రామపంచాయతీ నిధుల్లో ఒక్క పైసా దుర్వినియోగం చేసినట్లు నిరూపించినా తనపై ఎలాంటి చర్యలు తీసుకున్నా సిద్ధమేనని సవాల్ చేశారు. అభివృద్ధి పనుల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు.

అసైన్‌మెంట్ భూమిపై విచారణ జరపాలి

గ్రామంలోని సర్వే నంబర్ 5లో ఉన్న 1 ఎకరం 26 గుంటల అసైన్‌మెంట్ భూమిని గత మాజీ సర్పంచ్ ఇతరుల నుంచి దొడ్డిదారిలో తమ కుటుంబ సభ్యుల పేర్లపై అక్రమంగా పట్టా చేయించుకున్నారని దేశెట్టి పాటిల్ ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.అసైన్‌మెంట్ భూమిపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన పట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సర్వే నంబర్‌లోని అసైన్‌మెంట్ భూమిని గుంటలుగా విభజించి విక్రయించిన అంశంపై కూడా ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.గ్రామ అభివృద్ధికి ఆటంకం కలిగించే ఆరోపణలను పక్కనపెట్టి, వాస్తవాలను అధికారులు పరిశీలించాలని సర్పంచ్ కోరారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రజలు, అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఉపసర్పంచ్ జీవన్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హయ్యాత్ ఎలైట్ హాస్పిటల్స్‌లో ఆగస్టు నెలంతా ఉచిత సూపర్ స్పెషాలిటీ హెల్త్ ఫెస్టివల్

- **తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు**
- **ECG, ECHO, ఎంపిక చేసిన రక్త పరీక్షలు కూడా ఉచితం**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో గల హయ్యాత్ ఎలైట్ హాస్పిటల్స్ తమ తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆగస్టు 2026 నెల పొడవునా ఉచిత సూపర్ స్పెషాలిటీ హెల్త్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం ప్రకటించింది.ఈ హెల్త్ ఫెస్టివల్‌లో న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, కిడ్నీ–యూరాలజీ, జనరల్ మరియు లాపరోస్కోపిక్ సర్జరీ, డయాబెటిస్–థైరాయిడ్ విభాగాలకు చెందిన నిపుణులచే ఉచిత వైద్య సలహాలు అందించనున్నట్లు తెలిపింది. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు నిపుణుల వైద్య సలహాలను పొందేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. అదనంగా ఉచిత ECG, ECHO, ఎంపిక చేసిన రక్త పరీక్షలు, న్యూరో మరియు ఆర్థో ఫిజియోథెరపీ కన్సల్టేషన్ సేవలను కూడా అందుబాటులో ఉంచినట్లు యాజ మాన్యం వెల్లడించింది. అవసరమైన రోగులకు శస్త్రచిత్సకు సంబంధించి ప్రత్యేక ప్రయోజనాలు కల్పించనున్నట్లు పేర్కొంది.ప్రజలు తమ ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం సూచించింది. వైద్య సేవలు పొందాలనుకునే వారు ముందస్తుగా నమోదు చేసుకుని అపాయింట్‌మెంట్ పొందాలని కోరింది. అపాయింట్‌మెంట్ కోసం సంప్రదించాల్సిన నంబర్: 8435247365




# కరీంనగర్ కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా బోనాల ఉత్సవాలు



- **పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 05:**

కరీంనగర్ నగరంలోని కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ గారు సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో కరీంనగర్ నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఉండాలని మేయర్ గారు ప్రార్థించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే విశిష్టమైన పండుగ అని మేయర్ గారు పేర్కొన్నారు. కళాకారులు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మన పండుగలు సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని, భావితరాలకు సంప్రదాయాలను అందించడంలో కళాకారుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు.ఈ సందర్భంగా ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు, యువకులు, కళాకారులతో మేయర్ గారు ఆప్యాయంగా మమేకమై వారి అభినందనలు స్వీకరించారు. సంప్రదాయ డప్పు వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.కరీంనగర్ నగరంలో బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, మున్సిపల్ సిబ్బందికి మేయర్ గారు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, కళాకారులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు.

# గెలిస్తేనే ఘనత_ _ _ ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత : మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 05:**

జీవితం జీవించడానికే గానీ ఆత్మహత్యలకు కాదు అని, ఎలాంటి కష్టాలు ఎదురైనా ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు పిలుపునిచ్చారు. వైఫల్యాలను తాత్కాలికంగా భావించి, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని జీవితంలో విజయం సాధించాలని ఆయన సూచించారు. గెలిస్తేనే నిజమైన ఘనత లభిస్తుందని, ఆత్మహత్య సమస్యను సమాజమంతా కలిసి ఎదుర్కో వాల్సిన అవసరం ఉందని అన్నారు.బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్, కరపత్రాలను మేయర్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఆత్మహత్యల నివారణ కమిటీ మరియు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా గత 20 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యల నివారణ కోసం నిరంతరం కృషి చేస్తూ ఇప్పటివరకు 28 మంది ప్రాణాలను కాపాడడం అభినందనీయమన్నారు. సమాజంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇటీవల పోలీసు శాఖలో చోటుచేసుకుంటున్న ఆత్మహత్యల ఘటనలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర పోలీసు డీజీపీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో పోలీసు సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించడం మంచి నిర్ణయమన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కూడా విస్తృత స్థాయిలో మానసిక ఆరోగ్య, ఒత్తిడి నిర్వహణ, ఆత్మహత్యల నివారణపై కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు.ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ, ఆత్మహత్య ప్రయత్నం చేసే వ్యక్తుల పట్ల సమాజం మరింత సానుభూతితో వ్యవహరించాలని అన్నారు. అలాంటి వ్యక్తులకు మానసిక ధైర్యాన్ని నింపడం, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఒక వ్యక్తికి అన్ని మార్గాలు మూసుకుపోయినట్లు అనిపించినప్పుడు మాత్రమే ఆత్మహత్య అనే ప్రమాదకర ఆలోచన కలుగుతుందని, అలాంటి సమయంలో 'మేమున్నాం' అనే భరోసా కల్పిస్తే అనేక




ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు.ఆత్మహత్యలను నివారించడంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, సహచర ఉద్యోగులు, సామాజిక సంస్థలు, వైద్య నిపుణులు కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. మానసిక ఒత్తిడి, నిరాశ, ఒంటరితనం వంటి సమస్యలను చిన్నచూపు చూడకుండా అవసరమైన కౌన్సెలింగ్, వైద్య సహాయం పొందేలా ప్రోత్సహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా తెలంగాణ పత్రిక చీఫ్ ఎడిటర్ శ్రీ ఆడెపు సంపత్, 28వ డివిజన్ కార్పొరేటర్ శ్రీ భాస్కర్ నాయక్, ఆత్మహత్యల నివారణ కమిటీ సభ్యులు, ఆరోగ్య మిత్ర ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువజన ప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ మున్సిపల్‌లో SIR ప్రక్రియ వేగవంతం చేయాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు పూర్తయ్యేలా కృషి చేయాలి....**
- **మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చంద్రశేఖర్....**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై మాజీ మంత్రి, జహీరాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ డా. ఏ. చంద్రశేఖర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జహీరాబాద్ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో అసెంబ్లీ కో–ఆర్డినేటర్ మహమ్మద్ గౌస్, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఇతర మండలాలతో పోలిస్తే జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతోందన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పురోగతిలో న్యాలకల్ 95.42 శాతం, ఝరాసంగం 99.24, మొగుడంపల్లి 94.36, కోహిర్ 96.04, కోహిర్ మున్సిపల్ 92.46, జహీరాబాద్ మండలం 98.19, జహీరాబాద్ మున్సిపల్ 84.24 శాతం నమోదైనట్లు తెలిపారు. SIR ప్రక్రియను



100 శాతం పూర్తి చేసిన 50 మంది BLAలను చంద్రశేఖర్ అభినందించారు. ఒక్క అర్హుడు కూడా ఓటు హక్కుకు దూరం కాకుండా కృషి చేయాలని కోరారు.

# నల్లవాగు ప్రాజెక్ట్ కాలువలకు నీటిని విడుదల చేసిన శాసనసభ్యులు

- **ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 05 :**

నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండల పరిధిలోని ప్రాజెక్ట్ నల్లవాగు నిన్న రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా పూర్తి స్థాయిలో నిండి, అలుగు పారుతోంది. ప్రాజెక్ట్ అలుగు ద్వారా నీరు వృధాగా పోకుండా, ఆ నీటిని సమర్ధవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈరోజు గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఎడమ మరియు కుడి కాలువల ద్వారా దిగువ ప్రాంతాలకు సాగునీటిని అధికారికంగా విడుదల చేశారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...**

"రైతుల సంక్షేమానికి మన ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుంది. ప్రాజెక్ట్‌లో పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నందున, రైతులకు సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గంలోని రైతాంగానికి ఎప్పుడు అవసరమైతే అప్పుడు కాలువల ద్వారా సాగునీటిని అందించాలని అధికారులను ఆదేశించడం జరిగింది" అని తెలిపారు. రైతులు సాగునీటిని పొదుపుగా, ప్రాజెక్ట్ పరిధిలోని చివరి ఆయకట్టు వరకు అందేలా సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ



కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు పాటిల్,యాదవ రెడ్డిమండల నాయకులు, రమేష్ చౌహన్,మరియు శ్యామ్ముదిరాజ్,హన్మంతు, నరేందర్,గణేష్,రవీందర్ పాటిల్,మల్కొడ్డి తుకారాం, బండారి సాయిలు, గోవింద్ నాయక్,సర్పంచ్లు,అధికారులు, విట్టల్, వీర చారి,జైరాజ్, జమీల్,రాములు సెట్,బాబా ఖాన్,రమేష్,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# బోరంచ వద్ద శ్రీ సంగమేశ్వర ఆలయ మెట్ల నిర్మాణ పరిశీలించిన గౌరవ ఎమ్మెల్యే

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 05 :**

నారాయణఖేడ్ నియోజకవర్గంలో మానూర్ మండలం పరిధిలోని బోరంచ గ్రామంలో వేంచేసియున్న ప్రముఖ క్షేత్రం శ్రీ సంగమేశ్వర ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా చేపట్టిన అభివృద్ధి పనులను నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఈరోజు పరిశీలించారు. మాఘ అమావాస్య సందర్భంలో నదీ స్నానాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వారి భద్రతను దృష్టిలో ఉంచుకొని, అలాగే బోటింగ్ ప్లాట్‌ఫారమ్ వరకు సౌకర్యవంతంగా వెళ్లేందుకు వీలుగా నిర్మించిన మెట్ల నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఎమ్మెల్యే స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ**

"శ్రీ సంగమేశ్వర ఆలయం స్థానికంగా ఎంతో విశిష్టత కలిగిన పుణ్యక్షేత్రం. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు, పర్యాటకులకు సకల సౌకర్యాలు కల్పించడమే మన ప్రాధాన్యత. భక్తుల భద్రత మరియు సౌకర్యాన్ని పురస్కరించుకొని బోటింగ్ ప్లాట్‌ఫారమ్ వరకు మెట్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయించాం. రాబోయే రోజుల్లో



కూడా సంగమేశ్వర క్షేత్రాన్ని మరిన్ని మౌలిక వసతులతో, పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి మాజీ సర్పంచ్, రమేష్ చౌహన్ గ్రామ సర్పంచ్ బీరప్ప.కొంగరి శ్రీకాంత్ రెడ్డి, నవీన్ రెడ్డి, అఖిలేష్ రెడ్డి, మల్లప్పా,బాబన్న, బక్కుల్, దత్తు,నర్సింలు,రాఘవులు, సామ్సన్,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతకు కుట్టు మిషన్ల పంపిణీ అభినందనీయం

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 05:**



కరీంనగర్ నగరంలోని 12వ డివిజన్ రామచంద్రపూర్ కాలనీ అభయ మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అభయ మహిళా సాధికార కేంద్రం మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అందించి, అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేసింది. నగర మేయర్ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసి, వారి స్వయం ఉపాధి మరియు ఆర్థిక స్వావలంబనకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మహిళా సాధికారతకు సేవలందిస్తున్న అభయ మహిళా సాధికార కేంద్రం నిర్వాహకులను మేయర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి చొప్పరి జయశ్రీ వేణు, అభయ మహిళా సాధికార కేంద్రం నిర్వాహకులు బాలచంద్ర స్వామీజీ, మహిళలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌కు కేవలం ఐదు రోజులే గడువు

- ఆగస్టు 10లోపు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదును నిర్ధారించుకోండి – జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి
- ఎస్ఐఆర్ (Special Intensive Revision) కార్యక్రమానికి ఆగస్టు 10తో గడువు ముగియనుంది.
- ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే సంబంధిత BLOలకు ఫారాలు అందజేయాలి.
- ఓటరు జాబితాలోని పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలి.
- జిల్లా వ్యాప్తంగా EROలు, AEROలు, BLOలు ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.
- ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలి.

**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 05:**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (Special Intensive Revision–SIR) కార్యక్రమానికి కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని, జిల్లాలోని అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆగస్టు 10వ తేదీలోపు తమ ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (BLOలు) తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని, ఎన్నికల సంఘం కల్పించిన అదనపు గడువును ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారిని (BLO) సంప్రదించి పూర్తి వివరాలతో ఫారాలను సమర్పించాలని తెలిపారు. అసంపూర్ణంగా లేదా తప్పుగా నింపిన ఫారాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, అవసరమైన అన్ని వివరాలను స్పష్టంగా నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు కూడా తమ వివరాలను ఒకసారి తప్పని సరిగా పరిశీలించుకోవాలని తెలిపారు. పేరు, ఇంటి చిరునామా, వయస్సు, లింగం, కుటుంబ వివరాలు లేదా ఇతర సమాచారంలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని గడువులోపు సరిదిద్దించుకోవాలని సూచించారు. అవసరమైతే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి , సహాయ ఎన్నికల నమోదు అధికారి (AERO) లేదా బూత్ లెవల్ అధికారిని సంప్రదించి సవరణలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని అ న్ని నియోజక వర్గాల్లో ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రజలకు అవసరమైన మార్గదర్శకాలు, సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఎన్నికల నమోదు అధికారులు (EROలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (AEROలు), బూత్ లెవల్ అధికారులు (BLOలు) కార్యాలయ వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫారాల స్వీకరణ, సందేహాల నివృత్తి, సవరణల ప్రక్రియలో సహకరిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకుండా భారత ఎన్నికల సంఘం జారీ చేసిన అధికారిక మార్గదర్శకాలను మాత్రమే అనుసరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గడువు ముగిసే వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించడం ద్వారా చివరి నిమిషంలో రద్దీని నివారించవచ్చని చెప్పారు. "ఎస్ఐఆర్ కార్యక్రమానికి కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకం. ప్రతి ఓటరు తన వివరాలను ఒకసారి పరిశీలించి, అవసరమైతే సవరణలు చేయించుకోవడంతో పాటు ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు ఆగస్టు 10వ తేదీలోపు తప్పనిసరిగా సమర్పించాలి. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలి."» అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా ప్రజలకు సూచించారు.

- కార్యక్రమం: ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (SIR)
- గడువు: 10 ఆగస్టు 2026
- ఎవరికి: జిల్లాలోని అర్హులైన ఓటర్లందరికీ
- చేయాల్సింది : ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించడం, ఓటరు వివరాలు పరిశీలించడం, అవసరమైన సవరణలు చేయించుకోవడం
- సంప్రదించవలసిన వారు: BLOలు, EROలు, AEROలు
- విజ్ఞప్తి: చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలి.

# FLNAT–NIOS పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 05:**




సెప్టెంబర్–2026లో నిర్వహించనున్న FLNAT–NIOS పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. కిరణ్మయి అధికారులను ఆదేశించారు..బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టరేట్‌లో సంబంధిత జిల్లా అధికారులతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించి FLNAT–NIOS పరీక్ష ఏర్పా ట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఉల్లాస్ అభ్యాసకులందరూ పరీక్షకు హాజరై ఉత్తీర్ణులు కావడానికి అవసరమైన అన్ని చర్యల ను ఆయా శాఖలు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ప్రతి అభ్యాసకుడికి పరీక్షపై పూర్తి అవగాహన కల్పించి, లెర్నింగ్ సెంటర్లలో క్రమం తప్పకుండా తరగతులు నిర్వహిస్తూ ప్రత్యేక శిక్షణ అందించాలని తెలిపారు.పరీక్షకు సంబం ధించిన నమోదు, హాజరు, రవాణా, పరీక్షా కేంద్రాల నిర్వహణ, అభ్యాసకులకు సమాచారం చేరవేత తదితర అంశాలపై సంబంధిత శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. .గ్రామ, వార్డు స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగస్వామ్యమైన అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, జిల్లాను FLNAT–NIOS పరీక్షలో రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలపాలని పిలుపునిచ్చారు..ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, పిడి మెప్మా వెంకట నారాయణ, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శాంతిశ్రీ, సంబంధిత జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవం

- తల్లిపాలు -శిశువుకు సంపూర్ణ ఆహారం
- పుట్టిన మొదటి గంటలోనే (గోల్డెన్ Hour) తల్లిపాలు ప్రారంభించాలి
- పుట్టిన వెంటనే ముర్రుపాలు(colostrum) శిశువుకు మొదటి టీకాగా పనిచేస్తుంది
- మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి
- పాలు ఇవ్వడం వల్ల తల్లికి గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ లు రాకుండా కాపాడుతాయి
- డా. పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, హైదరాబాద్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**



ప్రపంచ తల్లిపాల వారోత్సవాల భాగంగా ఈరోజు ఏరియా హాస్పిటల్ గోల్కొండలో తల్లిపాల వారోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమమును ఉద్దేశించి మాట్లాడుతూ,శిశువుకు తల్లిపాలు సంపూర్ణ ఆహారం అని శిశువు జీవితానికి ఉత్తమ ప్రారంభం అని తెలియజేశారు. తల్లిపాల వారోత్సవం సందర్భంగా జిల్లాలో అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వారోత్సవాలు ఆగస్టు 7 వరకు జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం, తల్లులు తమ శిశువులకు పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు ఇవ్వడం, మరియు రెండేళ్లు అంతకంటే ఎక్కువ కాలం అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలు కొనసాగించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి సిబ్బంది వివరిస్తున్నారు అని తెలియజేశారు. ఈ సందర్భంగా తల్లిపాలలో ఉండే ప్రయోజనాల గురించి వివరిస్తూ తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారమని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, విరోచనాలు, న్యూమోనియా, ఇన్ఫెక్షన్స్ తగ్గుతాయని తెలియజేశారు. అలాగే మెదడు ఎదుగుదల మెరుగుపడుతుందని, అలర్జీలు తగ్గుతాయని, ఊబకాయము, మధుమేహము, రక్తపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని, భావోద్వేగ బంధం పెరుగుతుందని తెలియజేశారు. అలాగే బ్యాక్టీరియా, వైరస్ ల నుండి రక్షిస్తుందని అన్నారు. ముర్రు పాలలో ఇమ్యూనో గ్లోబులిన్, లాక్టోఫెరీను, ప్రోటీన్లు, విటమిన్ ఏ, విటమిన్ ఈ, జింక్ ఇంకా ఎన్నో పోషకాలు ముర్రుపాలలో ఉంటాయని తప్పకుండా పుట్టిన వెంటనే ముర్రుపాలు ప్రారంభించాలని తెలియజేశారు. తల్లి ,శిశువుకు పాలు ఇవ్వడం వలన తల్లికి గర్భాశయం, రొమ్ము క్యాన్సర్లు రాకుండా కాపాడతాయని, ప్రసవానంత రక్తస్రావం తగ్గుతుందని, మధుమేహము, అధిక బరువు, మానసిక ఒత్తిడి రాకుండా కాపాడతాయని, గర్భాశయము సాధారణ స్థితికి రావడానికి సహాయపడుతుందని, వెంటనే గర్భం రాకుండా తాత్కాలిక కుటుంబ నియంత్రణ విదానంగా పనిచేస్తుందని సూచించారు.ఆధునిక జీవనశైలిలో ఉద్యోగము, నగర జీవనము, సోషల్ మీడియా ప్రభావము వంటి కారణాలవలన చాలామంది తల్లిపాలు నిర్లక్ష్యం చేస్తున్నారు. పౌడర్ డబ్బా పాలు తల్లిపాలకు, ప్రత్యామ్నాయం కాదని, సోషల్ మీడియా అపోహలను నమ్మవద్దని, తల్లిపాలు ఇవ్వడం ఒక గర్వకారణంగా భావించి శిశువు మరియు తల్లి ఆరోగ్యం కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో డా. సుధీర్ , ప్రోగ్రామ్ ఆఫీసర్ & ఇన్స్పెక్షన్స్ (హాస్పిటల్ సర్వీసెస్) డా. శ్రీధర్ , జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి,డా. ఆస్త్రా కౌసర్, గోల్కొండ ఏరియా హాస్పిటల్ సూపరీటెండెంట్,డా . అమిర్ సిద్దికి, ఆర్ ఎం ఓ, డా. మురళీధర్ , ఎస్ పి హెచ్ ఓ గోల్కొండ, వైద్యాధికారులు, సిబ్బంది, తల్లులు , ,పాల్గొన్నారు.

# ఆగస్టు 7న ఐడీఓసీ ప్రాంగణంలో ఘనంగా బోనాల వేడుకలు

- జిల్లా అధికారులను ఆహ్వానించిన టీజీఈజేఏసీ నాయకులు

**మేడ్చల్ వెలుతురు ఆగస్టు 05:**



తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంయుక్త చర్యా సమితి (TGEJAC), మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 7వ తేదీ (శుక్రవారం) ఉదయం 11.00 గంటల నుంచి అనంతాయిపల్లి గ్రామంలోని ఐడీఓసీ (IDOC) కాంప్లెక్స్ ప్రాంగణంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు టీజీఈజేఏసీ జిల్లా నాయకులు తెలిపారు.ఈ మేరకు టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ బి. రవి ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బోనాల వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని టీజీఈజేఏసీ అనుబంధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల పదాధికారులు, సభ్యులు, అలాగే ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై బోనాల వేడుకలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (TEJAC) రాష్ట్ర చైర్మన్ శ్రీ మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ఏలూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అదనపు కలెక్టర్ శ్రీ ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే జిల్లా స్థాయి ఇతర ఉన్నతాధికారులను కూడా వేడుకలకు విచ్చేయాల్సిందిగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (DRDO) శ్రీ సాంబశివరావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. కూర్మార్తి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీ జగన్, తెలంగాణ నాన్–గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (TNGOs), మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి శ్రీ భరత్ కుమార్, జిల్లా కోశాధికారి శ్రీ శేషసాయి గిరికాంత్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు శ్రీ కార్తీక్, కార్యదర్శి శ్రీ అక్షయ్ కుమార్, అలాగే పీఆర్‌టీయూ (PRTU) జిల్లా అధ్యక్షుడు శ్రీ వై.రామేశ్వర్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ ఆనంద్తో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ,మీడియా ప్రతినిధులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఐడీఓసీ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీఈజేఏసీ జిల్లా నాయకులు వెల్లడించారు.



# టెక్నీషియన్ జేఏసీ సదస్సులో మల్‌రెడ్డి రాంరెడ్డి

- టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచన
- అసోసియేషన్ ద్వారా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**



తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ జేఏసీ ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్ లోని శిల్పి గ్రాండ్‌లో నిర్వహించిన టెక్నికల్ సెమినార్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ మల్‌రెడ్డి రాంరెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా శ్రీ మల్‌రెడ్డి రాంరెడ్డి గారు మాట్లాడుతూ, విద్యుత్ రంగంలో సేవలందిస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లు రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రతి టెక్నీషియన్ ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు .ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన విద్యుత్ సేవలు అందించాలంటే నిరంతర శిక్షణ, నైపుణ్యాభివృద్ధి మరియు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అత్యంత అవసరమని తెలిపారు. ఇలాంటి టెక్నికల్ సెమినార్లు ఆధునిక పరికరాల వినియోగం, విద్యుత్ భద్రత, ప్రమాదాల నివారణ, కొత్త సాంకేతిక విధానాలపై టెక్నీషియన్లకు ఉపయోగకరమైన అవగాహన కల్పిస్తాయని అన్నారు.ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లు సంఘటితంగా అసోసియేషన్ రూపంలో ముందుకు రావడం ద్వారా తమ వృత్తికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమర్థవంతంగా పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. సమష్టి కృషితో వృత్తికి గౌరవం, గుర్తింపు మరింత పెరుగుతుందని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు కార్మికుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వృత్తిపరమైన గుర్తింపు కోసం ప్రతి ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ సంబంధిత అధికారుల ద్వారా వైర్‌మ్యాన్ లైసెన్స్ పొందేందుకు ముందుకు రావాలని సూచించారు. లైసెన్స్ కలిగి ఉండటం ద్వారా అధికారికంగా విద్యుత్ పనులు, కాంట్రాక్టులు నిర్వహించే అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు.ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ.8 లక్షలకు పెంచడం, కార్మికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లకు ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం అవసరమైనా, వారి సమస్యలను గౌరవ కార్మిక శాఖ మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామి గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని మల్‌రెడ్డి రాంరెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నక్క యాదగిరి గారు, తెలంగాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సి. రెడ్డి గారు, ప్రధాన కార్యదర్శులు నేమాల బెనర్జీ గారు, వై. వెంకటేశ్వర్లు గారు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పొదిలా గోవర్ధన్ గారు, ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి గారు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు రమాకాంత్ గుప్తా గారు, సునీల్ బాబు గారు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్రామ్ రెడ్డి గారు, మాజీ టెంపుల్ డైరెక్టర్ కిరణ్ గారు, జేఏసీ రాష్ట్ర నాయకులు కొండ బాల్‌రెడ్డి గారు, శ్రావణ్ కుమార్ గారు, అలాగే తెలంగాణలోని వివిధ జిల్లాల ప్రతినిధులు లక్ష్మణ్ గారు, బ్రహ్మచారి గారు, కరుముద్దీన్ గారు, బుచ్చిరెడ్డి గారు, భూపాల్ రెడ్డి గారు, ఎం. కృష్ణ గారు, కె. భీమేష్ గారు పాల్గొన్నారు.

# ఆగస్టు 7న బెంగళూరులో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభకు బయలు దేరిన బీసీ జేఏసీ నాయకులు

- మండల్ కమిషన్ ప్రధాన సిఫారసులన్నిటిని అమలు చేయాలి.
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**



బీసీలకు విద్యా,ఉద్యోగ రంగాల్లో 27% రిజర్వేషన్లు అధికారికంగా అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం 1990 ఆగస్టు 7న,అప్పటి ప్రధానమంత్రి విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ లోక్‌సభలో ప్రకటించారని దాని సందర్భంగా ఆగస్టు 7న మండల్ దినోత్సవం సామాజిక న్యాయం దినోత్సవం జరుపుకుంటారని అన్నారు. బెంగళూరులో జరిగే అఖిలభారత జాతీయ ఓబిసి 11వ మహాసభకు బయలుదేరే బస్సులను బిసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ బీసీలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీసీలను ఐక్యం చేసి బీసీల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతామని అన్నారు.మండల్ కమిషన్ ప్రధాన సిఫారసులన్నింటిని అమలు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య బంటు కవిత తుపాకుల తుకారం నక్క నాగరాజు, మల్లికార్జున యాదవ్,సంపత్ నాయుడు గజ్జల సత్యరాజు సంధ్య సునీత తదితరులు పాల్గొన్నారు

# హర్మూజ్ జలసంధి తెరవాలి.. లేదంటే తీవ్ర పరిణామాలు: ట్రంప్

- ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా హెచ్చరిక
- హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవాలని స్పష్టీకరణ
- లేదంటే భారీ దాడులు తప్పవని వార్నింగ్
- మరో 48 గంటల్లో నిర్ణయంపై స్పష్టత వస్తుందని వెల్లడి
- అణ్వాయుధాలు కలిగి ఉండనివ్వబోమని మరోసారి స్పష్టం
- చర్చలపై ఇరాన్ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్
- పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు



**వాషింగ్టన్, వెలుతురు, ఆగస్టు 5:**

ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని వీలైనంత త్వరగా తెరవాలని, లేకపోతే తీవ్ర సైనిక దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా కొనసాగుతున్నప్పటికీ వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే టెహ్రాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద స్థాయి సైనిక చర్యకు అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని వెల్లడించారు. టెహ్రాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని మరోసారి స్పష్టం చేశారు.హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకల అంశంపై ఇరాన్, ఒమన్‌తో చర్చలు జరుగుతున్నాయని అమెరికా ప్రకటించింది. ఒకటి లేదా రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు.అయితే అమెరికా ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో జరుగుతున్న చర్చల్లో అమెరికాకు ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేసింది. తమ సార్వభౌమాధికారం, భద్రతా ప్రయోజనాలను పరిరక్షించే కొత్త సముద్ర రవాణా విధానాన్ని రూపొందించడంపైనే చర్చలు సాగుతున్నాయని పేర్కొంది.ఈ పరిణామాల మధ్య ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. హర్మూజ్ జలసంధి అంశంపై అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలపై ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఆర్ఎస్ ప్రవీణ్.. కల్వకుంట్ల కుటుంబానికి ఊడిగం చేస్తున్నారు: సంపత్ కుమార్

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌పై ఏఐసీసీ కార్యదర్శి విమర్శలు
- రాహుల్ గాంధీపై మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్య
- కేసీఆర్‌కు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణ
- బీఎస్పీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శ
- హరీశ్‌రావుకు లీగల్ నోటీసుల ప్రక్రియ తెలియదా అని ప్రశ్న
- క్షుద్రపూజల ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్
- సమాధానం ఇవ్వకుండా నోటీసులు పంపడం విడ్డూరమని వ్యాఖ్య

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 5:**

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరిస్థితి "డస్ట్‌బిన్‌లో టిష్యూ పేపర్‌లా" మారిందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదని అన్నారు.కేసీఆర్‌కు మద్దతుగా వ్యవహరిస్తూ ఒకే పదవిలో ఏడు సంవత్సరాలు కొనసాగారని సంపత్‌కుమార్ ఆరోపించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం ప్రభావంలో ఉండి వారికి ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు.ఐపీఎస్ అధికారిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని సంపత్‌కుమార్ అన్నారు. రాజకీయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.క్షుద్రపూజల ఆరోపణల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ హరీశ్‌రావుకు లీగల్ నోటీసుల ప్రక్రియ తెలియదా అని ప్రశ్నించారు. ఆయన న్యాయవాది అయినప్పటికీ ముందుగా ఆరోపణలకు సమాధానం చెప్పకుండా నోటీసులు పంపడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. క్షుద్రపూజల ఆరోపణలపై హరీశ్‌రావు ప్రజలకు వివరణ ఇవ్వాలని సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు.






# 20 నిమిషాల్లో 7 పేలుళ్లు.. దుబాయ్‌లో తీవ్ర ఉద్రిక్తత

- జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో వరుస పేలుళ్లు
- 20 నిమిషాల్లో ఏడు భారీ పేలుడు శబ్దాలు
- ఇంధన నిల్వ గిడ్డంగిలో చెలరేగిన భారీ అగ్నిప్రమాదం
- దట్టమైన పొగతో కమ్ముకున్న పరిసర ప్రాంతాలు
- ప్రాణ, ఆస్తి నష్టాలపై ఇంకా స్పష్టత లేదు
- హూతీల హస్తం ఉందని ఇరాన్ మీడియా కథనాలు
- ఘటనపై యూఏఈ నుంచి అధికారిక ప్రకటన లేదు

**దుబాయ్, వెలుతురు, ఆగస్టు 5:**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ నగరం వరుస పేలుళ్లతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం రాత్రి భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే ఏడు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. దీంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.పేలుళ్ల అనంతరం పరిసర ప్రాంతాలు దట్టమైన పొగతో కమ్ముకుపోయాయి.



ప్రపంచంలోనే అతిపెద్ద నౌకాశ్రయాల్లో ఒకటైన జెబెల్ అలీ పోర్టుకు సమీపంలో ఇంధన నిల్వ, రవాణా కోసం ఉపయోగించే గిడ్డంగిలో భారీ అగ్నిప్రమాదం సంభవించినట్లు ఉపగ్రహ చిత్రాలు సూచిస్తున్నాయి.ఈ ఘటనలో ప్రాణనష్టం, ఆస్తి నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెలువడలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం.పేలుళ్ల వెనుక యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటు దళాల హస్తం ఉండొచ్చని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. యెమెన్ నుంచి క్షిపణి దాడులు జరిగాయని ఇరాక్ ఆరోపించింది. అయితే ఈ ఘటనపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# కొంపల్లి, ఉప్పల్ ఫ్లైఓవర్ వేగంగా పూర్తి చేయండి



- గడ్కరీకి తెలంగాణ బీజేపీ ఎంపీల వినతి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన తెలంగాణ బీజేపీ ఎంపీలు
- కొంపల్లి, ఉప్పల్ ఫ్లైఓవర్ల నిర్మాణ ఆలస్యంపై ఆందోళన
- పెరుగుతున్న ప్రమాదాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎంపీలు
- గుంతలు లేకుండా సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి
- పది రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులకు గడ్కరీ ఆదేశాలు
- సమావేశంలో డీకే అరుణ సహా పలువురు ఎంపీల పాల్గొనడం

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 5:**

కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని తెలంగాణ బీజేపీ ఎంపీల బృందం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కొంపల్లి, ఉప్పల్ ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఫ్లైఓవర్ల నిర్మాణం ఆలస్యమవుతున్న కారణంగా ఆ ప్రాంతాల్లో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఎంపీలు వివరించారు. నిర్మాణ ప్రాంతాల పక్కనున్న సర్వీస్ రోడ్లలో గుంతలు లేకుండా తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించాలని గడ్కరీని కోరారు.ఎంపీల విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సర్వీస్ రోడ్ల పనులను పది రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, మాధవనేని రఘునందన్‌రావు, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గోడం నగేష్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ సరికొత్త విధానం.. బస్సు ఎక్కే ముందే టికెట్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**

నగర ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సరికొత్త విధానం అందుబాటులోకి తెస్తోంది. బస్సు ఎక్కే ముందే టికెట్ (అడ్వాన్స్/బోర్డింగ్ టికెటింగ్) విధానాన్ని త్వరలో ప్రవేశపెట్టనుంది. హైదరాబాద్ మెట్రో తరహాలో ఈ విధానం ఉంటుంది. 'మీ టికెట్' యాప్‌లోనే ఈ ఫీచర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం. దీంతో పాటు విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌లను అందించేందుకు ఆర్టీసీ కసరత్తు చేస్తోంది.గ్రేటర్‌లో 3200కి పైగా బస్సుల్లో 26 లక్షల మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో 70 శాతం మంది మహాలక్ష్మి ఉచిత ప్రయాణికులు. రోజూ ఆర్టీసీకి రూ.6.5 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఇందులో 23 శాతం డిజిటల్ చెల్లింపులే. తాజా విధానంతో డిజిటల్ చెల్లింపులు మరింత పెరగనున్నాయి. నిత్యం ఉదయం, సాయంత్రం బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉంటోంది. ఆ సమయంలో సీటు దొరక్క నిల్చుని.. జనాల మధ్య నుంచి టికెట్ తీసుకోవడం ప్రహసనమే. కొన్నిసార్లు డిజిటల్ చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ క్రమంలో టికెట్ జారీలో ఆలస్యమై బస్సు వేగం, షెడ్యూల్‌పై ప్రభావం పడుతోంది. ప్రయాణానికి ముందే టికెట్ తీసుకోవడం ద్వారా అటు కండక్టర్లు, ఇటు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రయాణికులు వారి మొబైల్‌యాప్‌లో బోర్డింగ్ స్టాప్, గమ్యస్థానం ఎంచుకొని యూపీఐ లేదా కార్డ్స్‌తో ముందే టికెట్ కొనుగోలు చేయవచ్చు. గమ్యం యాప్ ద్వారా బస్సులను ట్రాక్‌చేస్తూ.. టికెట్‌లో పేర్కొన్న సమయం ఆధారంగా ప్రయాణికులు వారి ప్రయాణాలను పక్కాగా ప్లాన్ చేసుకోవచ్చు.


**విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌ల జారీ**

ఆర్టీసీ ప్రవేశపెట్టిన డిజిటల్ బస్‌పాస్‌లకు మంచి స్పందన లభిస్తోంది. 'మీ టికెట్' మొబైల్ యాప్ ద్వారా ఫిబ్రవరి 25న ప్రారంభించగా.. ఇప్పటివరకు 14 వేల మంది వినియోగించుకున్నారు. రూ.2 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ప్రస్తుతం ఇందులో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్, పుష్పక్ బస్‌పాస్‌లు, టీ–24 టికెట్లు అందుబాటులో ఉన్నాయి. తాజాగా స్టూడెంట్ బస్‌పాస్‌ల జారీకి ఆర్టీసీ నిర్ణయించింది. దీంతో బస్‌పాస్ కౌంటర్ల వద్ద రద్దీ, సిబ్బందిపై భారం తగ్గనుంది.

# గడ్కరీపై డీప్‌ఫేక్‌లు.. తొలగించాలంటూ హైకోర్టు ఆదేశం

- ఈ20 పెట్రోల్‌పై తప్పుడు ప్రచారంపై బాంబే హైకోర్టు ఆగ్రహం
- గడ్కరీ, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న ఏఐ వీడియోలపై చర్యలు

**ముంబై, వెలుతురు, ఆగస్టు 5:**



ఈ20 పెట్రోల్ విషయంలో తనపై, తన కుటుంబంపై డీప్‌ఫేక్ వీడియోలు, తప్పుడు పోస్టులు ప్రచారం చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మెటా, గూగుల్ సహా పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఉన్న ఆ పోస్టులు, ఏఐతో రూపొందించిన వీడియోలను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఇటువంటి కంటెంట్ అత్యంత నీచమైనదని కోర్టు వ్యాఖ్యానించింది.ఈ సందర్భంగా బాధితులు కోర్టులను ఆశ్రయించకుండానే పరువు నష్టం కలిగించే నకిలీ పోస్టులను తొలగించే యంత్రాంగం సోషల్ మీడియా సంస్థల వద్ద లేదా అని హైకోర్టు ప్రశ్నించింది. అధునాతన సాంకేతికత అందుబాటులో ఉన్నప్పటికీ తప్పుడు సమాచారాన్ని అడ్డుకునే సమర్థ వ్యవస్థ ఎందుకు లేదని నిలదీసింది. వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించే పోస్టులను స్వచ్ఛందంగా గుర్తించి తొలగించే విధానాలు అమలు చేయాలని సూచించింది.ఈ20 పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ధి పొందుతోందంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని గడ్కరీ ఇటీవల ఆరోపించారు. దీనిపై డీప్‌ఫేక్ వీడియోలు, తప్పుడు పోస్టులు వైరల్ అవుతున్నాయని పేర్కొంటూ ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తన పరువుకు భంగం కలిగించినందుకు రూ.11 కోట్ల నష్ట పరిహారం కూడా కోరారు.ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతోందని, ఆ కార్యక్రమంతో తనకు లేదా తన కుటుంబానికి వ్యక్తిగత సంబంధం లేదని గడ్కరీ కోర్టుకు తెలిపారు. ఈ వ్యవహారంలో తదుపరి విచారణను హైకోర్టు కొనసాగించనుంది.

# రాళ్లు విసిరినా సంయమనం పాటించాలి.. పోలీసులకు సుప్రీంకోర్టు సూచన

- 'సంసద్ చలో' మార్చ్ హింసపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- నిరసనల సమయంలో సంయమనం పాటించాలని పోలీసులకు సూచన
- యువతను కౌన్సెలింగ్‌తో శాంతింపజేయాలని అభిప్రాయం
- ప్రభుత్వ దూకుడు హింసను మరింత పెంచుతుందని హెచ్చరిక
- నిరసనకారుల సమస్యలను వినడమే బలమైన ఆయుధమని వ్యాఖ్య
- శాంతియుత నిరసనలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- ఇతర పిటిషన్‌లతో కలిపి విచారించనున్న సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 5:**

'సంసద్ చలో' మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల సమయంలో పోలీసులు, భద్రతా బలగాలు సంయమనం పాటించాలని స్పష్టం చేసింది. యువత రాళ్లు విసిరినా వారిపై కఠినంగా వ్యవహరించకుండా, కౌన్సెలింగ్ ద్వారా శాంతింపజేయడానికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.జులై 20న జరిగిన 'సంసద్ చలో' మార్చ్‌లో హింసను ప్రేరేపించిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. నిరసనకారుల సమస్యలను వినడమే ప్రభుత్వాల వద్ద ఉన్న అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని పేర్కొంది.ప్రభుత్వం దూకుడుగా స్పందిస్తే సమాజంలో హింస మరింత పెరిగే ప్రమాదం ఉందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. దారితప్పిన మూకలు రాళ్లు రువ్వినా యువతను శాంతింపజేయడంపైనే దృష్టి పెట్టాలని సూచించింది. ప్రభుత్వాల నుంచి వచ్చే తీవ్రమైన ప్రతిస్పందన సమాజంలో ఉద్రిక్తతలను మరింత పెంచుతుందని వ్యాఖ్యానించింది.అయితే ఇలాంటి పరిస్థితులను ఎలా అదుపులోకి తీసుకురావాలనే విషయంలో పోలీసులకు తగిన అనుభవం, అవగాహన ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. శాంతియుత నిరసనలను ప్రోత్సహిస్తూ పరిస్థితులు అదుపు తప్పకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది.విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ, నిరసనల పేరుతో హద్దుమీరిన వారిపై చర్యలు తీసుకోకపోతే అది ప్రమాదకరమైన ఒరవడికి దారితీస్తుందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసును నిరసనలకు సంబంధించిన ఇతర పిటిషన్‌లతో కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది.



# ఆరోగ్యానికి కొవ్వులూ మంచివే!

మనిషి ఆరోగ్యకరమైన జీవితానికి సమతుల ఆహారం ఎంతో ముఖ్యం. సమతుల ఆహారంలో ప్రోటీన్లు, విటమిన్లు, కార్బొహైడ్రేట్లు, ఖనిజాలతో పాటు, కొవ్వులు కూడా ఉంటాయి. అయితే అందరూ ప్రోటీన్లకు , విటమిన్లకు ప్రాధాన్యత ఇస్తూ కొవ్వులను మాత్రం దూరం పెడుతుంటారు. కానీ కొవ్వులు, చర్మం, జుట్టు, మెదడు , రోగనిరోధక వ్యవస్థకు మేలు చేస్తాయి. మనం తీసుకునే ఆహారంలో ఆరోగ్యకరమైన కొవ్వులు తీసుకోవటం చాలా ముఖ్యమని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

శరీరానికి తగిన మోతాదులో కొవ్వు అవసరం. గుండె ఆరోగ్యకరంగా ఉంచుకునేందుకు చాలా మంది కొవ్వు పదార్థాలను దూరం పెడుతుంటారు. కొవ్వులపై చాలా మందికి అపోహలు, అనుమానాలున్నాయి. చెడుకొవ్వులు కలిగి ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల, ఎక్కువ మోతాదులో కొవ్వు పదార్థాలను తినటంలో శరీరంలో కొవ్వు పెరుగుతుందనేది వైద్యులు చెప్పే మాట. కొవ్వు పదార్థాలు తీసుకుంటే నిజంగానే అనారోగ్యం దరిచేరుతుందా అంటే పోషకాహార నిపుణులు కాదనే చెప్తారు. ఎందుకంటే కొన్ని కొవ్వులు శరీరానికి , ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అనేక పరిశోధనల్లోనూ ఇదే విషయం తేలింది. కొవ్వులు, చర్మం, జుట్టు, మెదడు, రోగనిరోధక వ్యవస్థకు మేలు చేస్తాయి. మీరు తీసుకునే ఆహారంలో ఆరోగ్యకరమైన కొవ్వులు తీసుకోవడం మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి ఆరోగ్యకరమైన కొవ్వులు అందించే పదార్థాలు కొన్నింటి గురించి తెలుకుందాం రండి...

### డార్క్ చాక్లెట్



ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. వారానికి ఐదు సార్లు డార్క్ చాక్లెట్ తినే వ్యక్తులు గుండె జబ్బులతో చనిపోయే అవకాశం సగం కంటే తక్కువగా ఉంటుంది, మీ చర్మాన్ని ఎండ వల్ల దెబ్బతినకుండా కాపాడతాయి. మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.

### కొబ్బరి, కొబ్బరి నూనె

కొబ్బరి నూనె , కొబ్బరికాయలు రెండింటిలోనూ సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. కొబ్బరిలో కనిపించే కొవ్వు ఆమ్లాలలో 90 శాతం సంతృప్త కొవ్వులు ఉంటాయి. కొబ్బరి కాయలను ఎక్కువగా తినే వారిలో ఆరోగ్యం మెరుగ్గా ఉండి గుండె సమస్యలు పెద్దగా ఉండవు.



### ఆవకాడో

ఆవకాడోల్లో ఒలేయిక్ యాసిడ్ ఉంటుంది. ఇది ఆకలి బాధలను తీర్చడంలో సహాయపడే ప్రయోజనకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులు కలిగి ఉంటుంది. ఒలీక్ యాసిడ్‌తో పాటు ఫైబర్, ప్రొటీన్లు ఉంటాయి. వాటిని కొద్దిగా మిరియాలు, ఉప్పుతో మసాలా కలుపుకొని తినవచ్చు. లేదా చిన్న ముక్కలుగా చేసి తీసుకోవచ్చు.



### చేప

చేపలలో ఒమేగా-3 కొవ్వులు ఎక్కువగా ఉంటాయి, అందుకే ఇది మెదడు, గుండె ఆరోగ్యానికి బాగా పని చేస్తుంది. విటమిన్లు D, B2 లు వీటిలో సమృద్ధిగా ఉంటాయి. అదే సమయంలో, కాల్షియం, భాస్వరం తగిన మొత్తంలో ఉంటుంది. ఇనుము, జింక్, అయోడిన్, మెగ్నీషియం వంటి ఖనిజాలతో నిండి ఉంటుంది. ప్రతి వారం రెండు చేపలను తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. అన్ని రకాల చేపల్లో మంచి కొవ్వులు ఉంటాయి.



### చియా విత్తనాలు

చియా గింజల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. అవి రుమటాయిడ్ ఆర్థరైటిస్ లక్షణాలను తగ్గిస్తాయి. రక్తంలో ట్రైగ్లిజరైడ్‌లను తగ్గిస్తాయి. అధిక రక్తపోటు ఉన్నవారిలో చియా గింజల పిండి రక్తపోటును తగ్గిస్తుంది. ఈ ఆరోగ్యకరమైన విత్తనాలలో కాల్షియం, ఐరన్, ప్రోటీన్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. చియా గింజలను స్మూతీస్‌లో చేర్చుకొని తీసుకోవచ్చు. మంచి పోషణ అందించే చియా విత్తనాలను సలాడ్‌లో కూడా తీసుకోవచ్చు.



ప్రకృతి నుంచి తయారయ్యే సహజమైన ఆహారాల్లో మంచి కొవ్వులు ఉంటాయి. వీటిలో పాలీ, మోనో శాచ్యురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. మంచి కొవ్వులు జీవక్రియను పెంచుతాయి. అంతేకాకుండా శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించడానికి కూడా తోడ్పడతాయి. కొలెస్ట్రాల్ శాతాన్ని అదుపులో ఉంచుతాయి. టైప్-2 మధుమేహాన్ని తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యంగా ఉండేందుకు సహకరిస్తాయి.



# ఐదు ఆహారపు అలవాట్లతో.. ఈ సీజన్‌లో సేఫ్

వర్షా కాలం అంటేనే చాలామంది అనారోగ్యాల బారిన పడతారు. తరచూ కురిసే వర్షా లతో మన చుట్టూ ఉండే పరిసరాల్లో నిలిచిపోయిన వాన నీరు, వాతావరణంలో నెలకొన్న మార్పుల కారణంగా వ్యాధులు, ఇన్ఫెక్షన్లను పెంచే క్రిములు అభివృద్ధి చెందుతాయి. వాటి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షా కాలంలో మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల ముప్పు పెరుగుతుంది. ఈ అనారోగ్యాలకు ప్రధాన కారణం మన రోగని రోధక శక్తి తగ్గడం. అందుకే, ఈ కాలంలో ఇమ్యూనిటీ పవర్ పెంచే పోషకాహారం తినాలి. ముఖ్యంగా ఐదు ఆహారపు అలవాట్లు పాటిస్తే వర్షా కాలంలో ఇన్‌ఫెక్షన్ల నుంచి పోరాడే శక్తి శరీరానికి లభిస్తుంది. మరి ఆ ఆహారపు అలవాట్లేంటో చూసేయండి..

### మితంగా తినాలి

వర్షా కాలంలో ఒకేసారి కడుపు నిండా తినకుండా, తక్కువ ఆహారాన్ని ఎక్కువసార్లు తినడం మంచిది. అంటే రోజులో నాలుగైదు సార్లు తక్కువ మొత్తంలో తింటూ ఉండాలి. దీనివల్ల జీర్ణ వ్యవస్థపై ఒత్తిడి తగ్గుతుంది. శరీరానికి కావాల్సిన పోషకాలు కూడా అందుతాయి. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే పప్పు దినుసులు, గుడ్లు, చేపలు లేదా చికెన్ వంటివి తినాలి. ఈ కాలంలో బయటి ఫుడ్ తింటే లేనిపోని హెల్త్ ప్రాబ్లమ్స్ రావచ్చు. అందుకే ఇంట్లో వండినవే తినడం మంచిది.


### శుభ్రమైన ఆహారం

వర్షా కాలంలో కూరగాయలు, పండ్లపై క్రిములు, బ్యాక్టీరియాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే వాటిని బాగా శుభ్రం చేసుకొని తినాలి. పండ్లు తినే ముందు వాటిని బాగా కడిగి, తొక్క తీసి తినాలి. గోరువెచ్చని నీటిలో ఉప్పు, పసుపు వేసి వాటిలో కూరగాయలను శుభ్రంగా కడగాలి. వాటిని పచ్చిగా తినకూడదు. కూరగాయలు, పండ్లలో విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి డైట్‌లో కచ్చితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.



### పరిశుద్ధమైన నీరు

వర్షా కాలంలో నీరు కలుషితం కావడం సర్వసాధారణంగా జరిగే విషయం. చూడటానికి మామూలుగానే కనిపించినా కలుషిత నీటి వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందుకే వేడి చేసిన గోరువెచ్చని నీటిని తాగాలి. బయట నుంచి తెచ్చిన నీటిని మరిగించి, చల్లార్చిన తర్వాత తాగాలి. బయటి ప్రదేశాల్లో, హోటళ్లలో నీళ్లను తాగకపోవడం మంచిది.



### ధాన్యాలు

వర్షా కాలంలో పప్పు ధాన్యాలు ఎక్కువగా తినాలి. పప్పుల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ కాలంలో గోధుమలు, బియ్యం, జొన్నలు, రాగులు వంటి వివిధ రకాల ధాన్యాలు డైట్‌లో ఉండేటా ప్లాన్ చేసుకోవాలి. ప్రోబయోటిక్స్ డైజెస్టివ్ సిస్టమ్‌లో మంచి బ్యాక్టీరియాలను పెంచుతాయి. దీని వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే పెరుగు, మజ్జిగ వంటి ప్రోబయోటిక్ ఫుడ్స్ తినాలి.

### హైడ్రేట్‌గా ఉండటం

ఈ సీజన్‌లో వాతావరణం చాలా తేమగా ఉంటుంది. దీంతో శరీరం చెమట రూపంలో ఫ్లూయిడ్స్ ఎక్కువ కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే, నీళ్లు బాగా తాగాలి. రోజుకు కనీసం 810 గ్లాసుల నీరు తాగడం మంచిది. లేదంటే అలసట, తలనొప్పి, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. చర్మం పొడిబారుతుంది, జుట్టు రాలే సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. అయితే ఈ సీజన్‌లో ప్రాసెస్డ్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్, షుగరీ డ్రింక్స్‌కు వీలైనంత దూరంగా ఉండటం ఉత్తమం.



# నడకతో ఆరోగ్యం.. నడకతో ఆయుష్షు..

**వాకింగ్ అత్యుత్తమైన ఆరోగ్య అలవాటు. పైసా ఖర్చు లేకుండా మన శరీరాన్ని బాగు చేసుకొనే ప్రక్రియ. క్రమం తప్పకుండా నడిస్తే రోగాలు దరి చేరవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాకింగ్ వల్ల లాభాలేంటి? అసలు వాకింగ్ ఏ సమయంలో చేయాలి? ఎలా చేయాలి? అన్న విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం. నడక వల్ల కలిగే ప్రయోజనాలు చాలా ఎక్కువ.**

**డిప్రెషన్ దూరమవుతుంది..!**

నడక వల్ల డిప్రెషన్ దూరమవుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నడక వల్ల గుండె సంబంధిత వ్యాధులు కూడా తగ్గే ముప్పు తగ్గుందం టున్నారు. వేగంగా నడవడం వల్ల గుండెకు, శ్వాస వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుంది. ఆంగ్జయిటీ లేదా డిప్రెషన్‌తో బాధపడేవారికి నడక మరింత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. నడవడం వల్ల శరీరంలోని ఎముకలు పటిష్టంగా మారతాయి. ఎముకలు పెళుసుగా మారడాన్ని నడకతో నివారించవచ్చు. రోజూ నడిస్తే శరీరంలోని కండరాలు బలంగా మారతాయి. నడక శరీరాన్ని సమతుల్యంగా ఉంచుతుంది. శరీరానికి సరైన ఆకృతిని అందిస్తుంది. కండరాలను ఆరోగ్యంగా మార్చుతుంది. బరువు తగ్గించుకోవడానికి నడక ఒక మంచి మార్గం. నడక వల్ల శక్తి ఖర్చు అవుతుంది. ఫలితంగా బరువు తగ్గవచ్చు. నడక వల్ల శరీరంలో చక్కెర స్థాయిలో అదుపులో ఉంటాయని అనేక అధ్యయనాల్లో తేలింది. నడక వల్ల కొవ్వు పేరుకోదు. గుండె జబ్బులు, డయాబెటిస్, కాలేయ వ్యాధులకు కొవ్వు పేరుకుపోవడమే కారణం. ఇన్సులిన్‌కు శరీరం స్పందించే తీరును కూడా నడక మెరుగుపరుస్తుంది.

**ఆయుష్షు ను పెంచుతుంది**

నడక, ఆయుష్షును పెంచుతుంది. నడక వల్ల 1620 సంవత్సరాలు అదనంగా జీవించవచ్చు. ఎంత ఎక్కువగా నడిస్తే, మరణాన్ని అంత దూరంగా తరిమేయవచ్చు. నడక కేవలం శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. డిప్రెషన్ విషయంలో నడక అనేది ఒక యాంటీ డిప్రెసెంట్‌గా పని చేస్తుంది. రోజూ వాకింగ్ చేయడం వల్ల క్రమశిక్షణ అలవడుతుంది. మానసిక స్థితి కూడా బాగుంటుంది. బహిరంగ ప్రదేశాల్లో నడవడం వల్ల శరీరంలో విటమిన్ 'డి' స్థాయిలు పెరుగుతాయి. శరీరానికి సూర్యరశ్మి తగలడం వల్ల శరీరంలో విటమిన్ డి ఉత్పత్తి అవుతుంది.

**ఎలా నడవాలి?**

తొలుత నెమ్మదిగా నడకను మొదలుపెట్టి క్రమ క్రమంగా వేగాన్ని పెంచాలి. గంటకు 6.4 కి.మీ వేగంతో రోజూ 30 నిమిషాల పాటు నడవడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఏదైనా వాకింగ్ గ్రూపులో చేరితే రోజూ నడవాలనే ఉత్సాహం కూడా వస్తుంది. ఒక్కసారి మీరు నడవాలని నిర్ణయించుకున్న తర్వాత అది మీ జీవితంలో భాగంగా మారుతుంది. ఇటీవలి కొన్ని పరిశోధనల ప్రకారం, మహిళలైతే ఉదయం 8 గంటల నుంచి 11 గంటల మధ్య నడిస్తే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అన్నింటికంటే రోజంతా చురుగ్గా ఉండటానికి నడక మంచి మార్గం. నడక ఉత్సాహంగా ఉంచుతుంది

**ఏ వయసు వారు ప్రారంభించాలి..!**

వాకింగ్ ను ఎవరైనా.. ఎప్పుడైనా మొదలుపెట్టొచ్చు. 45 ఏళ్ల లోపు వారికి ఎలాంటి పరీక్షలు అవసరం లేదు. 45 ఏళ్లు దాటినవారు..నడిస్తే ఆయాసం, గుండెనొప్పి, అధిక రక్తపోటు వంటి సమస్యలున్న వారు ముందుగా డాక్టర్‌ను కన్సల్ట్ అయ్యి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయసు నుంచే డయాబెటిక్ టైప్1 ఉన్న వారు డాక్టర్ సూచన మేరకే వాకింగ్, వర్కవుట్స్ చేయాలి. ఎందుకంటే వీళ్లు ఇన్సులిన్ తీసుకుంటుంటారు కాబట్టి రక్తంలో గ్లూకోజు బాగా పడిపోయే అవకాశముంది.డయాబెటిక్ టైప్2 ఉన్న వారు అందిరిలాగే వాకింగ్ చేయొచ్చు. ముందుజాగ్రత్తగా గ్లూకోజు బిస్కట్లు పెట్టుకోవటం మంచిది. గ్లూకోజు పడిపోయినట్లనిపిస్తే వెంటనే తినటానికి ఉపయోగపడతాయి.

**ఈ పరిస్థితుల్లో నడవొద్దు..!**

ఫుల్లుగా తిని వాకింగ్ చేయడం మంచిది కాదు. రెండు మూడ్రోజులు బ్రేక్ ఇచ్చి నడవడం కంటే డైలీ వాకింగ్ చేస్తేనే ప్రయోజనం. వాకింగ్ ఆపేసిన మళ్లీ ప్రారంభించాలంటే నెమ్మదిగా స్టార్ట్ చేయాలి. డైలీ అరంగట వాకింగ్ కు టైమ్ కేటాయించాలితక్కువ దూరంతో వాకింగ్ స్టార్ట్ చేసి రోజురోజుకు పెంచుకుంటూ వెళ్లాలి.



# చన్నీటి స్నానం మంచిదేనా?

చన్నీటితో స్నానం చేయాలా? వేడి నీటితో స్నానం చేయాలా? గోరువెచ్చటి నీటితో స్నానం చేస్తే బెటరా? చాలా మందిని ఈ సమస్యలు వేదిస్తుంటాయి. చలికాలం ఎలాగూ తప్పదు కాబట్టి చాలా మంది హాట్ వాటర్ తోనే స్నానం చేస్తారు. అయితే కొంతమంది కాలాలకు అతీతంగా ప్రతి సీజన్ లోనూ వేడినీటితోనే స్నాం చేస్తారు. అసలు నీటితో స్నానం మంచిది.. నిపుణులు ఏం చెప్తున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం..

చల్లటి నీటితో స్నానం చేయడమే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతుంటారు. చర్మ సంబంధిత సమస్యలు మొదలు ఎన్నో ఇతర సమస్యలకు చెక్ పెట్టొచ్చని అంటుంటారు. ఇక చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కూడా చాలా మంది భావిస్తుంటారు. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం వెంటనే రిఫ్రెష్ అవుతుంది. శరీరానికి ఇన్‌స్టంట్ ఎనర్జీ వస్తుంది. చల్లటి నీటితో స్నానం చేసిన వెంటనే ఉల్లాసంగా ఉంటారు. అలాగే చల్లని నీరు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది మీ చర్మాన్ని మెరిసేలా, ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగవుతుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఎంత టెన్షన్, ఒత్తిడి ఉన్నా బలదూర్ అవుతుందని చెబుతున్నారు. అయితే రోగ నిరోధక శక్తి బలపడుతుందా అంటే మాత్రం. కచ్చితంగా అవుననే సమాధానం చెప్పలేమని నిపుణులు అంటున్నారు. రోగనిరోధక శక్తిని బలోపేతం కావాలంటే చల్లటి నీటితో స్నానం చేస్తే సరిపోదని. తీసుకునే ఆహారంలో కూడా ఎన్నో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. ముఖ్యంగా విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# జపనీస్ మచా ఫ్లేవర్ టీతో ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు

మనదేశంలో టీ ఫ్యాన్స్ కు కొదవ లేదు. చాలా మందికి పొద్దునే ఓ కప్పు టీతాగితే డే స్టార్ట్ కాదు. ఇక ప్రస్తుతం మార్కెట్ లో రకరకాల టీ ఫ్లేవర్లు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే లేటెస్ట్ గా జపనీస్ మచా ఫ్లేవర్ టీ ట్రెండ్ అవుతోంది. అసలు ఈ టీ ప్రయోజనం ఏమిటి? దీంతో లాభాలు ఏంటి? ఈ టీని ఎలా తయారుచేస్తారు? ఈ కథనంలో తెలుసుకుందాం..!

**మాచా ఫ్లేవర్ టీ ..**

భారత్ లో టీ ఎంత ప్రాచుర్యం పొందిందో జపాన్ లో మచా ఫ్లేవర్ టీ కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉంది. రుచి మాత్రమే కాదు ఆరోగ్యానికి సంబంధించిన ఎన్నో పోషకాలు ఇందులో ఉన్నాయి. జపాన్‌కు చెందిన ప్రసిద్ధ గ్రీన్ టీ 'మచ్చా', దీనిని జపనీస్ మచా అని కూడా పిలుస్తారు. ఈ టీ ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందుతోంది. 'మచా' గ్రీన్ టీ ఆకులను గ్రైండ్ చేసి పొడి తయారు చేస్తారు. ఈ టీలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఎనర్జీ, డిటాక్సిఫికేషన్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ టీ తో కలిగే లాభాల కోసం ఇంకా అనేక ప్రయోగాలు కొనసాగుతున్నాయి.





# చుండ్రుకు చెక్ పెట్టండిలా..!

చుండ్రు ఈ సమస్య అందరినీ వేదిస్తోంది. అసలు చుండ్రును ఎలా పోగొట్టుకోవాలా.. ప్రస్తుత జీవనశైలి, ఆరోగ్య సమస్యలతో చాలా మందికి చుండ్రు సమస్యగా మారింది. ఇక నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, కెమికల్స్‌తో కూడిన షాంపూలు వాడడం కూడా ఓ కారణమని చెబుతున్నారు. చుండ్రును తగ్గించుకోవడానికి మార్కెట్లో లభించే రకరకాల షాంపూలను, నూనెలను ఉపయోగిస్తుంటారు. అయితే ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఉపశమనం లభించకపోతే బిర్యానీ ఆకులతో నేచురల్ చిట్కా పాటిస్తే.. చుండ్రు ఇట్టే పరార్ అవుతుంది. బిర్యానీ ఆకులోని ఔషధ గుణాలు చుండ్రును తరిమేస్తాయని నిపుణులు చెబుతున్నారు. బిర్యానీ ఆకుల ద్వారా కేవలం చుండ్రు మాత్రమే కాకుండా.. తలపై ఉండే వాపు, దురద, దద్దుర్లు, పొడి బారడం వంటి సమస్యలను దూరం అవుతాయి. ఇంతకీ బిర్యానీ ఆకులతో హెయిర్ ప్యాక్‌ను ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఇలా చేయండి..!**

బిరానీ ఆకులను తీసుకొని. కొని నీళు పాసుకొని బాగా మరిగించాలి. ఆకులు పూర్తిగా మరిగిన తర్వాత, చల్లార్చి బిర్యానీ ఆకులను మిక్సీ పట్టుకోవాలి. అలాగే అందులో.. కాస్త వేప ఆయిల్ లేదా అలోవెరా జెల్, ఉసిరి పొడి లాంటివి యాడ్ చేసి మిక్స్ చేయాలి. అనంతరం ఈ మిశ్రమాన్ని తలకు బాగా పట్టించాలి. ఇలా ఓ ఐదు నిమిషాలు మసాజ్ చేసిన తర్వాత పావుగంట పాటు ఆరబెట్టాలి. ఆ తర్వాత షాంపూతో తలను శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. ఇలా వారంలో రెండు సార్లు చేస్తే మార్పు ఇట్టే



# తొలగించకపోతే చర్యలు తప్పవు: మృణాల్ ఠాకూర్



కృత్రిమ మేధ(ఏఐ)ను దుర్వినియోగం చేసి సృష్టించే డీప్ ఫేక్ ఫొటోలకు వ్యతిరేకంగా గళం విప్పారు హీరోయిన్ మృణాల్ ఠాకూర్. ఇప్పటికే నటీనటుల వ్యక్తిగత హక్కులను ఉల్లంఘిస్తూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఏఐ ఆధారిత ఫొటో ప్రచారాలపై పలువురు బాలీవుడ్ తారలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మృణాల్ తన ఫొటోలను ఉపయోగించి కంటెంట్‌ను సృష్టించి వాటిని డిజిటల్ మాధ్యమాల్లో ఉంచేవారికి హెచ్చరిక జారీ చేశారు. ''నా డీప్‌ఫేక్ ఫొటోలను సృష్టించి వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. తక్షణమే వాటిని తొలగించండి. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవల్సి వస్తుంది'' అని మృణాల్ ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చారు.

# కొత్త సినిమా ప్రకటించిన సందీప్ కిషన్




యంగ్ హీరో సందీప్ కిషన్ కొత్త ప్రయోగం చేయనున్నారు. 'సూపర్ సుబ్బు'లో టీచర్‌గా ప్రేక్షకులను అలరించిన ఆయన.. ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఫాంటసీ అడ్వెంచర్ సినిమాతో రానున్నట్లు తెలిపారు. రెండు భాగాలుగా ఈ చిత్రం విడుదల కానుంది.
యుగంధర్ ముని దర్శకత్వంలో రానున్న ఈ సినిమాకు 'కరికాల – ఎ మ్యాజికల్ వరల్డ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రెండు భాగాల విడుదల తేదీలను తెలుపుతూ నేడు ఫస్ట్‌లుక్‌ను పంచుకున్నారు. మొదటి పార్ట్ వచ్చే ఏడాది జులై 2న విడుదల కానుండగా.. 2027 అక్టోబర్ 28న రెండో భాగం ప్రేక్షకుల ముందుకు రానుంది. పాన్ ఇండియా స్థాయిలో దీన్ని తెరకెక్కిస్తున్నట్లు టీమ్ తెలిపింది. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను పంచుకోనున్నారు.
ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.

# 'బిగ్‌బాస్'.. క్రమశిక్షణ లేని ప్రవర్తనను అంగీకరించను: నాగార్జున



బుల్లితెర రియాలిటీ షో 'బిగ్‌బాస్' తెలుగు సీజన్–10 ముస్తాబవుతోంది. దీనికి సంబంధించిన ప్రోమో షూటింగ్‌ను టాలీవుడ్ అగ్రకథానాయకుడు నాగార్జున ఇటీవల పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన ముచ్చటించారు. బిగ్‌బాస్ విశేషాలతో పాటు తన 100వ చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.
''ప్రోమో షూట్ చాలా బాగా జరిగింది. గత కొన్నేళ్లుగా నేను ఈ షోను హోస్ట్ చేస్తున్నా. ఇది పదో సీజన్ కావడంతో సరికొత్తగా, మరింత ఉన్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. ఇతరుల ప్రవర్తనను నిర్ణయించడం, సూచనలు చేయడం నాకిష్టం ఉండదు. అందుకే మొదటి రెండు సీజన్లలో కొంచెం ఇబ్బందిగా అనిపించింది. ఆ తర్వాత షో ఫార్మాట్ అలవాటైంది. గత సీజన్ సూపర్ హిట్ కావడంతో, ప్రేక్షకుల డిమాండ్ మేరకు ఈసారి ఫిజికల్ టాస్కులు మరింత కఠినంగా ఉండబోతున్నాయి. షోలో కంటెస్టెంట్లు హద్దులు దాటి, క్రమశిక్షణ లేకుండా ప్రవర్తిస్తే అస్సలు అంగీకరించను'' అని నాగార్జున పేర్కొన్నారు.
ఇక తన 100వ సినిమా (King100) గురించి నాగార్జున అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను అభిమానుల ముందుకు తీసుకొస్తామని వెల్లడించారు.

# గత పది నెలలు.. ఊహించని రీతిలో పరీక్షించాయి: నీరజ్ చోప్రా

కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధిస్తాడని నీరజ్ చోప్రాపై అభిమానులు భారీ అంచనాలే పెట్టుకున్నారు. కానీ, అతడికి శ్రీలంక అథ్లెట్ రుమేశ్ రూపంలో అడ్డంకి ఎదురైంది. దీంతో నీరజ్ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే నీరజ్ తాజాగా చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. గత పది నెలల నుంచి తాను చాలా కఠిన పరిస్థితులు ఎదుర్కొన్నట్లు అందులో పేర్కొన్నాడు. కండరాల గాయంతో ఇటీవల అతడు కొంతకాలం పాటు జావెలిన్ త్రోకు దూరమైన సంగతి తెలిసిందే. అయినా సరే కామన్వెల్త్ గేమ్స్ లో 85.83 మీటర్లు విసిరి రజతం దక్కించుకున్నాడు.
''అథ్లెట్ విసిరే కొన్ని త్రోలు చాలా దూరం వెళ్తాయి. కానీ, కొన్ని క్షణాలు మాత్రం ఆ ప్రయాణం తాలూకా భారాన్ని మోసుకెళ్తాయి. గత పది నెలలు నేను అనుకొన్నట్లు సాగలేదు. ఆ రోజులు నన్నెంతో పరీక్షించాయి. గాయాల నుంచి కోలుకోవడం, నా శరీరాన్ని సిద్ధం చేసుకోవడం, రిథమ్‌ను అందుకోవడం సవాళ్లతో కూడుకున్నదే. పోటీపడాలని ఎంతగానో ఆశపడినా.. ఓపిక పట్టడం నేర్చుకున్నా'' అని నీరజ్ చోప్రా తెలిపాడు.

**వారందరికీ ధన్యవాదాలు..**
''ఏ సీజన్‌లో బరిలోకి దిగుతానో లేదో తెలియకుండానే రోజుల తరబడి సాధన చేసేవాడిని. ఇప్పుడు (కామన్వెల్త్ గేమ్స్) కూడా పోటీ పడతానని అనుకోలేదు. అయితే, పతకం సాధించేలా సత్తా చాటడం బాగుంది. ఇదంతా నా ఒక్కడి వల్లే సాధ్యమైందని మాత్రం చెప్పను. ఈ ప్రయాణంలో నాపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెబుతున్నా. ప్రతి అడుగులోనూ ముందుండి నడిపించిన ఫిజియో ఇషాన్‌కు థాంక్స్. జావెలిన్‌ను అందుకొన్నప్పటి నుంచి నాతోపాటు ఉంటోన్న కోచ్ జై, నా కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది. ఈ సీజన్‌లో ఒక్కో అడుగులో మెరుగవుతూ ముందుకు సాగుతున్నా'' అని నీరజ్ రాసుకొచ్చాడు.






# సీనియర్ ఆటగాళ్లను కాపాడుకోవాలి: అజింక్య రహానే

టెస్టు క్రికెట్ జట్టులో యువ ఆటగాళ్ల కంటే సీనియర్ ప్లేయర్లు ఎక్కువ మంది ఉండాలని అజింక్య రహానే అభిప్రాయపడ్డాడు. ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పలు విషయాల గురించి మాట్లాడాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ పూర్వ వైభవం పొందాలంటే ప్రస్తుతం ఉన్న సీనియర్ ఆటగాళ్లను జట్టులో కొనసాగించాలన్నాడు. సీనియర్లు ఒకేసారి ఆటకు దూరమవుతుండటం టీమ్‌ఇండియాకు సమస్యగా మారిందని 'జింక్స్' పేర్కొన్నాడు.
''గత రెండేళ్లుగా నేను టెస్టు క్రికెట్ ఆడకపోవడంతో ఇంట్లోనే కూర్చొని మ్యాచ్‌లు వీక్షించా. భారత జట్టు స్వదేశంలోనే మ్యాచ్‌లు ఓడిపోవడం కూడా చూశా. టెస్టు క్రికెట్ ఆడాలంటే పట్టుదల ఉండాలి. దాన్ని భారత ఆటగాళ్లు పెంపొందించుకుని పోటీతత్వంతో కూడిన క్రికెట్ ఆడాలి. ప్రతి సెషన్ పూర్తిగా ఆడాలి. చాలా జట్లు అలా చేయడం లేదు. నేను ఏ జట్టు గురించి ప్రత్యేకంగా చెప్పదల్చుకోలేదు. భారత టెస్టు క్రికెట్‌లోకి గత రెండేళ్లలో కొత్త ఆటగాళ్లు వచ్చారు. వారి సంగతి పక్కన పెట్టండి. టెస్టు జట్టులో 7–8 మంది సీనియర్లు, ఇద్దరు లేదా ముగ్గురు యువ ఆటగాళ్లు ఉండాలనేది నా అభిప్రాయం. కానీ, ఇప్పుడు జట్టు కొత్త వాళ్లతో నిండిపోతోంది. దాదాపుగా సీనియర్ ఆటగాళ్లంతా రిటైర్ అయ్యారు. మిగిలిన అనుభవజ్ఞులైన ఆటగాళ్లను గౌరవించడం చాలా అవసరం. నిజం చెప్పాలంటే టెస్టు క్రికెట్ గురించి నాకు భయంగా ఉంది. ఇది మనుగడ సాగించాలని మనందరం కోరుకోవాలి. ముఖ్యంగా భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌతాఫ్రికాల్లో టెస్టు క్రికెట్ కొనసాగాలి'' అని రహానే వివరించాడు.
గతేడాది రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ఛతేశ్వర్ పుజారా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తాజాగా రహానే కూడా రిటైర్మెంట్ ప్రకటించడంతో జట్టులో సీనియర్ల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం భారత జట్టులో రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే 50 కంటే ఎక్కువ టెస్టులు ఆడారు.

# ఒక్కడినే విమర్శించడం సరికాదు.. గంభీర్‌కు మద్దతుగా మాజీ చీఫ్ సెలక్టర్



గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా వచ్చినప్పటి నుంచి టీమ్‌ఇండియా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మంచి ఫలితాలే సాధిస్తోంది. టెస్టుల్లో మాత్రం పేలవ ప్రదర్శన చేస్తోంది. స్వదేశంలో న్యూజిలాండ్, సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్‌ల్లో ఘోర ఓటములను మూటగట్టుకుంది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ తొమ్మిది మ్యాచ్‌లు ఆడి నాలుగు విజయాలు, నాలుగు ఓటములతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. గంభీర్ ఒంటెద్దు పోకడల వల్లే టెస్టుల్లో భారత్ పేలవ ప్రదర్శన చేస్తోందని విమర్శలు వస్తున్నాయి. త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్ గంభీర్‌కు అగ్నిపరీక్షగా మారింది. ఒకవేళ ఈ సిరీస్ కూడా కోల్పోతే అతనిపై వేటుపడే అవకాశాలు లేకపోలేదు. ఇలాంటి తరుణంలో గంభీర్‌కు మాజీ చీఫ్ సెలక్టర్ సందీప్ పాటిల్ మద్దతుగా నిలిచాడు. జట్టు వైఫల్యాన్ని ఒక్క వ్యక్తిపైనే మోపలేమన్నాడు.
''శ్రీలంక పర్యటన అందరికీ కీలకం. కేవలం గంభీర్‌నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? అతను మంచి ఫలితాలు తేవడంలో విఫలమైతే ఆటగాళ్లు కూడా విఫలమైనట్లే. ఒక్కరినే విమర్శించడం సరికాదు. మన ఆటగాళ్లు స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయారు. అందుకే న్యూజిలాండ్‌తో స్వదేశంలో సిరీస్ ఓడిపోయాం. అంతేకాకుండా కివీస్ ఆటగాళ్లు పూర్తి సన్నద్ధతతో ఇక్కడికి వచ్చారు. వారు స్పిన్‌కు అనుకూలమైన వికెట్లపై ప్రాక్టీస్ చేశారు. టీమ్‌ఇండియా మాత్రం బ్యాటింగ్, బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై ప్రాక్టీస్ చేసింది. అదే భారత జట్టుకు ప్రతికూలంగా మారింది. అందుకే ఓటములను చవిచూసింది'' అని సందీప్ పాటిల్ పేర్కొన్నాడు.
2007–2008 మధ్య టీమ్‌ఇండియాకు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించిన లాల్‌చంద్ రాజ్‌పుత్ కూడా గంభీర్‌కు అండగా నిలిచాడు. కోచ్ అన్నాక ఒడుదొడుకులు సహజమని, ప్రతిసారీ గెలవలేమని పేర్కొన్నాడు. ప్రస్తుతం భారత జట్టు పరివర్తన దశలో ఉందని.. ఇలాంటి సమయంలో ఆటగాళ్లకు, కోచ్‌కు తగినంత సమయం ఇవ్వాలన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి దిగ్గజాలు రెండు ఫార్మాట్ల నుంచి తప్పుకోవడం కూడా టీమ్‌ఇండియాపై ప్రభావం చూపిస్తోందని లాల్‌చంద్ రాజ్‌పుత్ అన్నాడు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో భారత్ రెండు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. ఇప్పటికే టీమ్‌ఇండియా శ్రీలంకకు చేరుకుంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com